న్యాయమూర్తులు చట్టాలను పరిరక్షించాలి

- స్వార్థంతో కూడిన తీర్పులివ్వకూడదు
- జస్టిస్ బి.చంద్రకుమార్

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 220 | విజయవాడ, సోమవారం 13 మార్చి 2023 | 10 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 13 March 2023 | Rs



ఆగని ప్రలోభాలు

నోట్ల పంపిణీపై మంత్రి ఉషశ్రీ చరణ్ సమీక్ష

బర్తరఫ్ చేయాలని ప్రతిపక్షాల డిమాండ్

నేడు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్



డబ్బుల పంపిణీపై అధికారులు, వైసిపి నేతలతో సమీక్షిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎంఎల్‌సి ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న కొన్ని గంటల ముందు కూడా రాష్ట్ర వ్యాప్తంగా అధికారపార్టీ ప్రలోభాలు కొనసాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసిపి నాయకులు బరితెగిస్తున్నారు. ఎక్కడికక్కడ గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయుల నుండి ప్రతిఘటన ఎదురవుతున్నా నోట్లకట్టలను వెదజల్లుతూనే ఉన్నారు. ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు ఈ తరహా సంఘటనలు అనేకం వెలుగు చూసినా, ఎన్నికల అధికారుల స్పందన అంతంత మాత్రమే! రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉష శ్రీ చరణ్ నోట్ల పంపిణీ జరుగుతున్న తీరుపై ఏకంగా సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు వెలుగులోకి వచ్చిన వీడియోలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఆమెను తక్షణం మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అనంతపురం జిల్లాలోని తన సొంత నియోజకవర్గమైన కళ్యాణదుర్గంలో నగదు పంపిణీ జరిగిన తీరును సమీక్షిసూ ఆమె వీడియో కెమెరాలకు దొరికారు. ఆ నియోజకవర్గంలోని ఒక గ్రామంలో 20 ఓట్లున్నాయని, వారందరికీ కలిపి 20 వేల రూపాయలు పంపిణీ చేశారా లేదా అన్న విషయాన్ని ఆరా తీస్తూ విడియోలో మంత్రి కనిపించారు. నగదు తీసుకున్న వారందరూ వైసిపికి ఓట్లు వేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా మంత్రి చెప్పారు. ఈ సంఘటనపై ఎన్నికల అధికారులకు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. మరోవైపు నోట్ల పంపిణీ వ్యవహారంలో రాష్ట్ర వ్యాప్తంగా వార్డు, గ్రామ వాలంటీర్లను వైసిపి నేతలుఉపయోగించుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. కొన్నిచోట్ల నేరుగా వారితో నగదు పంపిణీ చేయించగా, మరికొన్ని చోట్ల వారు చూపించిన వ్యక్తులకు వైసిపి నేతలు నగదు పంపిణీ చేశారు. దీంతో ఈ వ్యవహారం తమకు ఎక్కడ చుట్టుకుంటోందోనన్న ఆందోళన వాలంటీర్లలో వ్యక్తమవుతోంది.

విశాఖలో డబ్బు పంచుతూ దొరికిన వైనం

జివిఎంసి పరిధిలోని 16వ వార్డు భాను నగర్ ప్రాంతంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న వైసిపి కార్యకర్త కొల్లి ఈశ్వరరావును పిడిఎఫ్ బృందం సభ్యులు ఆదివారం పట్టుకున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని సదరు వ్యక్తి డబ్బులు పంచుతున్నాడు. పిడిఎఫ్ నాయకులు డాక్టర్ బి.గంగారావు, పి.మణి, ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు మిగతా 2లో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోగస్ ఓట్లు

- 'వైసిపి'తో ఎన్నికల అధికారులు కుమ్మక్కు
- కేంద్ర ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు లేఖ

లోపలి పేజీల్లో..

నేడు పోలింగ్

- ఉదయం 8 నుంచి 4 వరకు
- సిఇఓ ముకేష్‌కుమార్ మీనా

మంత్రి ఉషశ్రీచరణ్‌ను బర్తరఫ్ చేయాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పశ్చిమ రాయలసీమ నియోజకవర్గంలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరుపున బహిరంగంగా డబ్బుపంపిణీ చేస్తున్న రాష్ట్ర శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అధికారపార్టీ ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా గొంతునులమడమే గాకుండా మొత్తం ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేస్తోందని విమర్శించారు. మంత్రి ఉషశ్రీచరణ్ బహిరంగంగా డబ్బుపంపిణీ చేసిన ఘటనపై ఎన్నికల కమిషన్ తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

- బడ్జెట్ ఆమోదానికే ప్రభుత్వ ప్రాధాన్యత
- ప్రజా సమస్యలపై నిలదీయనున్న ప్రతిపక్షాలు
- అదానీ అక్రమాలపై జెపిసికి పట్టు
- సిబిఐ, ఇడి దుర్వినియోగంపైనా నిలదీత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లో బడ్జెట్‌కు సంబంధించిన ఆర్థిక బిల్లును ఆమోదించడమే తమ ప్రాధాన్యతని ప్రభుత్వం తెలిపింది. బిజెపి రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకొని సిబిఐ, ఇడి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా చేయిస్తున్న దాడులు, అదానీ అక్రమాలుతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి వంటి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షాలు ప్రణాళికలు సిద్ధం చేశాయి. ప్రధానంగా అదానీ అక్రమాలపై విచారణ చేపట్టేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) నియమించాలని విపక్ష సభ్యులు పట్టుబట్టేవీలుంది. సోమవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2022-23 కోసం రెండవ బ్యాచ్ గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్లను సమర్పించనున్నారు. 2023-24 సంవత్సరానికి గాను జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత బడ్జెట్‌ను కూడా ఆమె లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. సమాఖ్య నిర్మాణంపై దాడి, కేంద్ర దర్యాప్తు సంస్థల 'దుర్వినియోగా'న్ని వ్యతిరేకిస్తూ సమాజ్‌వాదీ పార్టీ, వామపక్షాలు, డిఎంకె పార్టీలు నిరసన తెలియజేయనున్నాయి. ఈ సమావేశాలు మార్చి 13న ప్రారంభమై ఏప్రిల్ 6 వరకు కొనసాగుతాయి.

ఆస్కార్‌కు వేళాయె!

'నాటునాటు'పై సర్వత్రా క్రేజ్

ఉదయం 5.30 గంటల నుంచి వేడుకలు షురూ

లాస్ ఏంజిల్స్ : ప్రపంచ సినీ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆస్కార్స్ 2023 లేదా 95వ అకాడమీ అవార్డుల సంబరం రానేవచ్చింది. అవార్డుల ప్రదానోత్సవానికి అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లో ఉన్న డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబు అయ్యింది. భారత కాలమాన ప్రకారం ఈ నెల 13న సోమవారం ఉదయం 5.30 నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ప్రముఖ దర్శకులు ఎస్‌ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ బరిలో నిలిచిన నేపథ్యంలో ఈ దఫా వేడుకలు భారత చలనచిత్ర రంగానికి విశేషమైనవి. గోల్డెన్ గ్లోబ్, హాలీవుడ్ సినీ క్రిటిక్స్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలను కైవసం చేసుకొని ఇప్పటికే విశ్వవ్యాప్తంగా విశేష క్రేజ్ సంపాదించుకున్న 'నాటునాటు' పాట ఆస్కార్‌ను కైవసం చేసుకోవడం ఖాయమని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆస్కార్‌కు నామినేట్ అయిన తొలి భారతీయ సినిమా పాట ఇదే. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగానూ ఉత్కంఠ నెలకొంది. పలుచోట్ల ప్రత్యేక కార్యాక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఆస్కార్ వేదికపై 'నాటునాటు' పాట పాడేందుకు గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ లాస్ ఏంజిల్స్ చేరుకున్నారు. దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకులు ఎంఎం కీరవాణితో సహ ఆర్‌ఆర్‌ఆర్ బృందం కూడా లాస్ ఏంజిల్స్‌లోనే నేరుగా వేడుకలను ఆస్వాదించనుంది. ఆస్కార్ వేడుకల ప్రత్యక్ష ప్రసారాలను ఎబిసి నెట్‌వర్క్, అలాగే యూట్యూబ్, డైరెక్ట్ టివి, వంటి లైవ్ స్ట్రీమింగ్ వేదికల ద్వారా వీక్షించవచ్చు. భారత్‌లో డిస్నీ, హాట్‌స్టార్ ఛానెళ్ల ద్వారా వీక్షించవచ్చు.

అంతర్జాతీయ మీడియా అంచనా ఇలా..

ఆస్కార్ పురస్కారాల కంటే ముందుగా ప్రకటించే గ్లోడెన్ గ్లోబ్, హాలీవుడ్ సినీ విమర్శకుల అవార్డులకు ప్రత్యేక గుర్తింపు వుంది. ఈ రెండు అవార్డుల్లో ఏ ఒక్కదానిని కైవసం చేసుకున్నా ఆయా చిత్రాలకు, నటులకు ఆస్కార్ పక్కా అన్న విషయాన్ని గత చరిత్ర చెబుతోంది. వీటి ఆధారంగా అంతర్జాతీయ మీడియా ఆస్కార్ అవార్డులు దక్కేదెవరికో ముందుగానే జోస్యం చెబుతూ కథనాలు వెలువరించింది. ఆ కథనాల ప్రకారం.. అవార్డులు ఇలా ఉండే వీలుంది.

ఉత్తమ చిత్రం : ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్

ఉత్తమ దర్శకులు : డేనియల్ క్వాన్, డేనియల్ సెచినర్ట్ (ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్)

ఉత్తమ నటుడు : బ్రెండాన్ ఫ్రాజర్ (ద వేల్)

ఉత్తమ నటి : మిషెల్ యేహ్ (ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్)

ఉత్తమ సహ నటుడు : కె హుయ్ క్వాన్ (ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్)

ఉత్తమ సహ నటి : ఏంజిలా బస్సేట్ (బ్లాక్ పాంథర్ : వకండా పారెవర్)

ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే : ఎవరీ థింగ్ ఎవరీ వేర్ ఆల్ అట్ వన్స్

ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే : ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టన్ ఫ్రంట్

ఉత్తమ డాక్యుమెంటరీ : నవల్నేయ్

ఉత్తమ ఒరిజినల్ సాంగ్ : నాటు నాటు (ఆర్‌ఆర్‌ఆర్)

ఉత్తమ యానిమేషన్ చిత్రం : గుయిలెర్మో డెల్ టోరోస్ పినోసిచియో

ఉత్తమ అంతర్జాతీయ చిత్రం : ఆల్ క్వైట్ ఆన్ ద వెస్టన్ ఫ్రంట్

లోపాయికారి ఒప్పందాలు ఉండవు

జనసేన అధినేత పవన్ కల్యాణ్



ఈదర హరిబాబును జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన ఏ పార్టీ జెండా, అజెండాల కోసం పనిచేయదని, పార్టీ కోసం పనిచేసిన ఏ ఒక్కరి ఆత్మగౌరవానికి భంగం వాటిల్లనివ్వనని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. వాస్తవిక ధోరణితో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటామే తప్ప లోపాయికారి ఒప్పందాలు పెట్టుకోబోమని చెప్పారు. జనసేన మంగళగిరి పార్టీ కార్యాలయంలో కాపు నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మధ్య వెయ్యికోట్లు, వెయ్యి కోట్లు అని కొందరు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, డబ్బుతో ఎవరూ రాజకీయపార్టీని నడపలేరని తెలిపారు. జనసేన పార్టీ భావజాల బలంతో నడుస్తుందే తప్ప డబ్బుతో కాదని అన్నారు. కాపులు పెద్దన్న పాత్ర పోషించి దళితులు, బిసిలను కలుపుకుని వెళ్తేనే రాజ్యాధికారం సిద్ధిస్తుందని, లేనిపక్షంలో ఎప్పటికీ రాజకీయ సాధికారత సాధ్యం కాదని అన్నారు. సంఖ్యా బలం ఎక్కువగా ఉండి కూడా రాజ్యాధికారం చేజిక్కించుకోలేని కులాల్లో కాపు, తెలగ, బలిజ, ఒంటరి సమూహాలు చాలా కీలకమైనవన్నారు. కాపుల్లో ఐక్యత రానంత వరకు రాజకీయ సాధికారత సాధ్యం కాదన్నారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుభవిస్తున్న గనులు బలిజలకు చెందినవేనన్నారు. సిఎం కుటుంబం పెట్టిన హింసను తట్టుకోలేక మైన్స్ వదిలిపెట్టేశారని, రాయలసీమలో బలిజలు గొంతెత్తాలని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. సిఎం జగన్‌ది ఫ్యూడలిస్టిక్ మనస్తత్వం అని అన్నారు. జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, వైసిపి కుట్రలను కాపు, బిసిలు తిప్పికొట్టాలని అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు ఈదర హరిబాబు, టివి రామారావు జనసేనలో చేరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు హరిరామజోగయ్య, కాపు నేతలు పాల్గొన్నారు.

పిడిఎఫ్‌కు మొదటి ఓటు ఇచ్చి గెలిపించండి

- ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎన్ఆర్ సదాశివరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రసర్వతోముఖాభివృద్ధి, భావితరాల భవిష్యత్ కోసం ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు అత్యంత ప్రాధాన్యత కలిగిందని తెలిపారు. ఈ విషయంలో ప్రధాన రాజకీయ పక్షాలు నిర్లిప్తత వహిస్తుండడం దురదృష్టకరమని విమర్శించారు. 25 ఎంపీ సీట్లు ఇస్తే మెడలు వంచి హోదా తీసుకొస్తానని చెప్పిన వైసిపి ఇప్పుడు ఢిల్లీ పాదుషాల దగ్గర మెడలు వంచి, రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రత్యేకహోదాను వ్యతిరేకిస్తోందని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించి ఉద్యమాల్లో పాల్గొంటూ, పోరాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థులకు రాష్ట్రంలోని విద్యావంతులు, మేధావులు, సామాన్యులు, ఉపాధ్యాయులు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.



వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

పారదర్శక పాలన

- వైసిపి ఆవిర్భావ దినోత్సవ సభలో నేతలు
- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అన్ని జిల్లాల్లోనూ ఆ పార్టీ కార్యాలయాల వద్ద వైసిపి జెండాను స్థానిక నాయకులు ఆవిష్కరించారు. మంత్రులు, ఎంఎల్‌ఏలు ఎక్కడికక్కడ భాగస్వాముల య్యారు. వైసిపి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు, రాష్ట్ర ప్రజానీకానికి ఒక ట్వీట్‌లో శుభాకాంక్షలు తెలిపారు. పన్నెండు సంవత్స రాలుగా తనతో కలిసి ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు ట్వీట్‌లో ఆయన పేర్కొన్నారు. ఆ ప్రయాణం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వైసిపి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి 12 సంవత్సరాలుగా పార్టీని దిగ్విజయంగా నడుపుతున్నారన్నారు. అవినీతి కి అవకాశం లేకుండా ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో దేశంలోనే ఆదర్శ వంతమైన సంస్కరణలను తీసుకొచ్చా రని అన్నారు. సచివాలయ వ్యవస్థతో పరిపాలన స్వరూపాన్ని మార్చేశారని పేర్కొన్నారు. ప్రజలిచ్చిన అధికారాన్ని బాధ్యతగా భావించి పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సిఎం కెసిఆర్‌కు స్వల్ప అస్వస్థత

ప్రజాశక్తి- హైదరాబాద్



తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు శనివారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కడుపులో కొంచెం నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆయనను గచ్చిబౌలిలోని ఎఐజి హాస్పిటల్‌కు ఉదయం తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు సిఎంకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. సిటి స్కాన్, ఎండోస్కోపి పరీక్షలు కూడా చేశారు. సిఎంకు కడుపులో చిన్న అల్సర్ ఉన్నట్లు ఈ పరీక్షల్లో తేలింది. మందులతో అది తగ్గిపోతుందని వైద్యులు తెలిపారు. అల్సర్ మినహా మిగతా అన్ని పరీక్షలూ సాధారణంగానే ఉన్నట్లు తేలింది. దీంతో, అల్సర్ తగ్గడానికి అవసరమైన వైద్య చికిత్స ప్రారంభించారు. 'ప్రస్తుతం సిఎం ఆరోగ్యం సాధారణంగానే ఉంది. సిటి స్కాన్, ఎండోస్కోపీ నిర్వహించాం. ఆయన గ్యాస్ట్రిక్ సమస్యతో ఇబ్బంది పడ్డారు. అల్సర్ ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. దీనికి సంబంధించి వైద్య చికిత్స అందిస్తున్నాం' అని ఎఐజి హాస్పిటల్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు రాంరాం

వచ్చే ఏడాది కేంద్ర బడ్జెట్‌లో రూ.లక్షే

- మిర్చి, పసుపు, ఉల్లి రైతులకు నష్టం
- వేరుశనగ, శనగ, పప్పులు, హార్టికల్చర్ కూడా...
- రాష్ట్ర కేటాయింపులపై ఉత్కంఠ



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు కేంద్రం చెల్లుచీటి ఇచ్చేసింది. రైతుల ఉత్పత్తులకు మార్కెట్‌లో ధరలు పతనమైన సందర్భాల్లో ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకొని పంటలను కొనుగోలు చేసి పోటీ సృష్టించి తద్వారా వ్యాపారులు దిగి వచ్చేలా చేస్తుంది. అందుకు ఉద్దేశించిన మార్కెట్ ఇంటర్వెన్షన్, ప్రైస్ సపోర్ట్ స్కీంల (ఎంఐఎస్-పిఎస్‌ఎస్)ను ఎత్తేసే ఆలోచనలో కేంద్రం ఉంది. ఈ పథకాలకు వచ్చే ఏడాది బడ్జెట్‌లో కేవలం లక్ష రూపాయలు మాత్రమే ప్రతిపాదించడంతో 'మార్కెట్ ఇంటర్వెన్షన్' ప్రశ్నార్థకమైంది. జాతీయ ఆహార భద్రతా చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థల కోసం వరి ధాన్యం, గోధుమలను కేంద్రం సేకరిస్తోంది. ఇప్పుడు వాటికీ పరిమితులు విధించింది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటించిన ఇతర పంటలు, ఎంఎస్‌పి లేని పంటల కొనుగోళ్లకు ఎంఐఎస్-పిఎస్-ఎస్‌లే దిక్కు. కాగా వచ్చే ఏడాది కేంద్రం ఆ పథకాలకు నిధులు కేటాయించకపోవడంతో ఆయా పంటలు పండించే రైతుల పరిస్థితి అగమ్యగోచరమైంది. కార్పొరేట్ల, ప్రైవేటు వ్యక్తుల దయాదాక్షిణ్యాలపై రైతన్నలు ఆధారపడాల్సిన ప్రమాదం పొంచి ఉంది. కాగా రైతులకు కేంద్రం మొండి చెయ్యి చూపించిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో అందుకవసరమైన నిధులు కేటాయించి రైతులకు మద్దతుగా నిలవాల్సి ఉంది.

రద్దు దిశ

వేరుశనగ, శనగ, ఇతర పప్పుధాన్యాలు, కొన్ని చిరు ధాన్యాలకు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది. మార్కెట్‌లో ఈ పంటలకు ఎంఎస్‌పి కంటే తక్కువ ధర పలుకుతున్నప్పుడు మార్కెట్‌లో జోక్యం చేసుకొని పరిమిత పరిమాణంలోనైనా సదరు పంటలను రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, ఆయిల్‌ఫెడ్ వంటి సంస్థలతో కేంద్ర సంస్థలైన నాఫెడ్, ఎన్‌సిడిసి వంటి సంస్థలు నిధులిచ్చి కొనిపిస్తాయి. కొన్నాళ్లు గోదాముల్లో నిల్వ చేసి వాటిని పిడిఎస్‌కు లేదంటే వ్యాపారులకు విక్రయిస్తాయి. ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం వలన అప్పటి వరకు తక్కువ ధరకు కొనుగోలు చేసే వ్యాపారులు కొంత వరకు దిగి వచ్చి ధర పెంచుతారు. ఆ మేరకు రైతులకు కొంత మేలు జరుగుతుంది. ఎంఎస్‌పి లేని పంటలైన మిరప, పసుపు, ఉల్లి, అరటి, బత్తాయి వంటి వాటికి 'ప్రైస్ సపోర్ట్ స్కీం' ఉంది. మార్కెట్‌లో ధరలు పడిపోయినప్పుడు ప్రభుత్వ ఏజెన్సీలు ఎంఎస్‌పి నిర్ణయించి కొంత మేరకు కొనుగోలు చేస్తాయి. ఈ చర్య ప్రైవేటు వ్యాపారులు ధర పెంచడానికి దోహదపడుతుంది. రైతులకు ఉపశమనం కలిగించే ఎంఐఎస్-పిఎస్‌ఎస్‌లకు 2021-22లో కేంద్రం రూ.2,288 కోట్లు ఖర్చు చేసింది. 2022-23లో రూ.1,500 కోట్లకు కేటాయింపులు తగ్గించింది. వచ్చే 2023-24లో కేవలం రూ.లక్ష ప్రతిపాదించింది.

ఇక అంతా రాష్ట్రమే

ధరలు పడిపోయినప్పుడు వేరుశనగ, శనగ, కొన్ని సందర్భాల్లో కందులు, మినుములు, పెసలను రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా కొనుగోలు చేస్తోంది. ఎంఎస్‌పి లేని మిరప, పసుపు, అరటి, బత్తాయి (చీని) ఇత్యాది హార్టికల్చర్ పంటలను కొంటోంది. అందుకు కేంద్ర నిధులను ఉపయోగించుకుంటోంది.

రాష్ట్ర సర్కారు తన బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధికి రూ.3 వేల కోట్లు కేటాయిస్తామని తొలుత చెప్పింది. ఆ నిధిని రెండేళ్ల నుంచి రూ.500 కోట్లకు తగ్గించింది. అవి సైతం పూర్తి స్థాయిలో ఖర్చు కావట్లేదు. కేంద్ర నిధులకు మ్యాచింగ్ చేసి పరిమితంగా పంటలు కొనుగోలు చేస్తోంది. వచ్చే ఏడాది నుంచి కేంద్రం నిధులివ్వకపోతే రాష్ట్రమే పూర్తిగా నిధులు భరించాలి. లేదంటే రైతుల నుంచి ఇప్పుడు కొనే పరిమాణంలో కూడా కొనే పరిస్థితి ఉండదు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

మృతుల్లో భార్యాభర్తలు, తండ్రీ కొడుకులు



నగరి మున్సిపాల్టీ పరిధిలోని ధర్మాపురంలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

ప్రజాశక్తి- నగరి (చిత్తూరు జిల్లా), కనిగిరి (ప్రకాశం జిల్లా)

రాష్ట్రంలో ఆదివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. వారిలో భార్యభర్తలు, తండ్రీకొడుకులు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన యువరాజన్ (42), నాగజ్యోతి (42) దంపతులు ఉద్యోగ రీత్యా సింగపూర్‌లో ఉంటూ అక్కడి సిటిజన్ షిప్ తీసుకున్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంతోపాటు పలు ప్రాంతాలు చూడడానికి సింగపూర్ నుంచి చెన్నై విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి ఓలా క్యాబ్‌లో తిరుమలకు వస్తుండగా నగరి మున్సిపాల్టీ పరిధిలోని ధర్మాపురం వద్ద వీరి క్యాబ్‌ను ఎదురుగా వస్తున్న ట్యాంకర్ ఢీకొంది. క్యాబ్‌తోపాటు రోడ్డు పక్కనే పల్లపు ప్రాంతంలోని పచ్చికబయలులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో దంపతులతోపాటు క్యాబ్ డ్రైవర్ ఇళంగోవన్ (20) అక్కడికక్కడే దుర్మణం చెందారు. వారి మృతదేహాలను ప్రకాశం జిల్లా కనిగిరిలో కల్వర్టును కారు ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రాంపల్లికి చెందిన ఎన్.రామకోటేశ్వరరావు (60), ఆయన కుమారుడు బ్రహ్మేశ్వరరావు (40) అక్కడికక్కడే మృతి చెందారు. రామకోటేశ్వరరావు భార్య సత్యవాణికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరులో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ రెండు కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి అభ్యర్థి సుధాకర్ అనర్హుడు

- ఎన్నికల సంఘానికి రిటైర్డ్ ఐఎఎస్ ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ అనర్హునిగా తక్షణమే ప్రకటించాలని విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ భారత ఎన్నికల సంఘానికి ఆదివారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్ సమర్పించిన అఫిడవిట్‌లో ప్రస్తుతం ఆయన ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేస్తున్నట్టు ఉందన్నారు. ఆ హోదాతో ఆయన ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్నారని తెలిపారు. తన హోదాలో బ్రాహ్మణ కార్పొరేషన్ లబ్ధిదారులకు రుణాలు ఇచ్చే అవకాశమున్నందున ఓటర్లను ప్రభావితం చేయగలరని చెప్పారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకొని అతన్ని ఈ ఎన్నికల నుంచి తక్షణమే అనర్హునిగా ప్రకటించాలని ఎన్నికల అధికారులను శర్మ కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ ఎ మల్లికార్జునను ప్రజాశక్తి వివరణ కోరగా.. సీతంరాజు సుధాకర్ ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవికి కొద్ది రోజుల కిందట రాజీనామా చేశారని, ఈ రాజీనామాను ప్రభుత్వం ఆమోదించిందని చెప్పారు.

కివీస్ లక్ష్యం 285

- ఛేదనలో ప్రస్తుతం 28/1
- శ్రీలంకతో న్యూజిలాండ్ తొలి టెస్టు

క్రైస్ట్‌చర్చ్ : శ్రీలంక, న్యూజిలాండ్ తొలి టెస్టు రసకందాయంలో పడింది. ఐదో రోజు ఆటలో ఫలితం కోసం ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. శ్రీలంక నిర్దేశించిన 285 పరుగుల లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 28/1తో కొనసాగుతుంది. ఓపెనర్ టామ్ లేథమ్ (11 బ్యాటింగ్), కేన్ విలియమ్సన్ (7 బ్యాటింగ్) అజేయంగా ఆడుతున్నారు. డెవాన్ కాన్వే (5) నిరాశపరిచాడు. చివరి రోజు ఆటలో 90 ఓవర్లలో న్యూజిలాండ్‌కు మరో 257 పరుగులు అవసరం కాగా.. శ్రీలంక మరో 9 వికెట్ల దూరంలో నిలిచింది. ఇక బ్లెయిర్ టిక్‌నర్ (4/100), మాట్ హెన్రీ (3/71), టిమ్ సౌథీ (2/57) రాణించటంతో శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 302 పరుగులకు కుప్పకూలింది. ఎంజెలో మాథ్యూస్ (115, 235 బంతుల్లో 11 ఫోర్లు) శతకానికి తోడు ధనంజయ డిసిల్వ (47), దినేశ్ చండిమాల్ (42) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 373 పరుగులు చేయగా.. శ్రీలంక 355 పరుగులు చేసింది.

ఇగా స్వైటెక్ ముందంజ

ఇండియన్ వెల్స్ మాస్టర్స్

ఇండియన్‌వెల్స్ : మహిళల సింగిల్స్ టాప్ సీడ్, అగ్రశ్రేణి క్రీడాకారిణి ఇగా స్వైటెక్ (పోలాండ్) ఇండియన్‌వెల్స్ మాస్టర్స్‌లో ముందంజ వేసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో స్వైటెక్ అలవోక విజయం నమోదు చేసింది. అమెరికా అమ్మాయి క్లేరీ లీయుపై 6-0, 6-1తో అలవోక విజయం సాధించింది. ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన స్వైటెక్ అమెరికా అమ్మాయిని చిత్తు చేసింది. ఐదో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) సైతం మూడో రౌండ్లోకి ప్రవేశించింది. దాల్మా గాల్ఫీపై 6-1, 6-7(4-7), 6-4తో కరోలినా గార్సియా గెలుపొందింది. దాల్మా 14 ఏస్‌లతో మెరిసినా.. మూడు సెట్ల పోరులో గార్సియా పైచేయి సాధించింది. జర్మనీ అమ్మాయి మరియ వరుస సెట్లలో ఓటమి చెందింది. రష్యా అమ్మాయి డరియా కసట్కినా 6-2, 6-1తో వరుస సెట్లలో విజయం సాధించింది. ఎలెనా రెబకానా 7-6(8-6), 7-6(7-5)తో సోఫియ కెనిన్‌పై విజయంతో మూడో రౌండ్‌కు చేరుకుంది. అమెరికా వెటరన్ స్టార్ మడిసన్ కీస్ కథ రెండో రౌండ్లోనే ముగిసింది. 1-6తో సోరొన సిర్‌స్టెటీ చేతిలో తొలి సెట్ చేజార్చుకున్న మడిసన్.. వాకోవర్‌తో టోర్నీ నుంచి నిష్క్రమించింది.





విశాఖలోని స్వర్ణభారతి స్టేడియం నుంచి బ్యాలెట్ బాక్స్‌లు తరలిస్తున్న దృశ్యం, బ్యాలెట్ బాక్సులను సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉదయం 8నుంచి మధ్యాహ్నం 4 వరకూ పోలింగ్
- పరిశీలకులుగా సీనియర్ ఐఎఎస్ అధికారులు
- 10,59,420మంది ఓటర్లు
- నకిలీ సర్టిఫికెట్లతో ఓటు వేస్తే క్రిమినల్ చర్యలు
- సిఇఓ ముకేష్‌కుమార్ మీనా



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మూడు గ్రాడ్యుయేట్, రెండు ఉపాధ్యాయ, మూడు లోకల్‌బాడీ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మరో ఐదు స్థానిక సంస్థలకు సంబంధించి వైసిపి నుంచి అనంతపురం నుంచి ఎం.మంగమ్మ, కడప నుంచి రామసుబ్బారెడ్డి పొన్నపురెడ్డి, నెల్లూరు నుంచి మేరిగ మురళీధర్, తూర్పుగోదావరి నుంచి కుడుపూడి సూర్యనారాయణరావు, చిత్తూరు నుంచి సుబ్రహ్మణ్యం సిపాయి ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సిఇఓ ముకేష్‌కుమార్‌మీనా తెలిపారు. పోలింగ్‌కు సంబంధించిన అన్నిరకాల ఏర్పాట్లు చేయడం పూర్తయిందని వెల్లడించారు. ఆదివారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈనెల 13న ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 10,59,420మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 10,00,519 మంది, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 55,842, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లు 3,059 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం మీద 1538 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో 584 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఇఓ పేర్కొన్నారు. ఓటర్లు 10 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. తెలంగాణ నుంచి 500 జంబో బ్యాలెట్ బాక్సులు తీసుకొచ్చామని పేర్కొన్నారు.

బోగస్ ఓట్లపై పరిశీలన

బోగస్ ఓట్లని చెబుతున్న వాటిని పరిశీలించి యూనివర్శిటీ సర్టిఫికెట్, అటస్టేషన్ చేసి ఉందో లేదో పరిశీలిస్తున్నామని చెప్పారు. నకిలీ సర్టిఫికెట్లతో ఓటు హక్కు వినియోగించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రలోభాల పర్వం మీద ఫిర్యాదులు వస్తున్నాయని, ఆయా జిల్లా కలెక్టర్లకు విచారణ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. బోగస్ ఓట్లపై టిడిపి, సిపిఎం నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో 500 పేర్లకు సంబంధించి ఇప్పటికే విచారణ చేసి ఇసికి నివేదిక పంపామన్నారు. పోలింగ్ ఏజెంట్లు ఆ నియోజకవర్గానికి చెందిన వారెవరైనా ఉండవచ్చన్నారు. ఎన్నికల ప్రక్రియను లైవ్ వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ద్వారా నిశితంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎన్నికలు జరిగే 13వ తేదీ, కౌంటింగ్ జరిగే 16 తేదీల్లో ఏ కేంద్రంలో అయితే ఓట్ల లెక్కింపు జరుగుతోందో ఆ కేంద్రాల్లో అవసరాన్ని బట్టి స్థానికంగా సెలవు దినాన్ని ప్రకటించేందుకు జిల్లా కలెక్టర్లకు అధికారాన్ని ఇచ్చామని పేర్కొన్నారు. 13న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా స్పెషల్ క్యాజువల్ లీవ్ / పర్మిషన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన కేసుల వివరాలు

టీమ్ పేరు	ఎపి
ప్రాపర్టీ కేసులు	0
నగదు సీజ్‌రూ.	77,48,010లు
లిక్కర్ సీజ్	1,02,819.05లీటర్లు
ప్రొహిబిషన్ కేసులు	64
అరెస్టులు	75
బెల్టు షాపులు మూసివేత	0
లైసెన్స్ తుపాకులు డిపాజిట్ చేసినవి	7,380
ముందు జాగ్రత్త చర్య కింద నమోదు కేసులు	1941
బైండోవర్ కేసులు	7,266

ఎన్నికల పరిశీలకులు (గ్రాడ్యుయేట్)

నియోజకవర్గం		
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం	సిద్దార్ధజైన్	9618888739
ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు	భాస్కర్ కాటంనేని	9676697575
కడప, అనంతపురం, కర్నూలు	పి. భాస్కర్	9893374444, 9849047074
	ఉపాధ్యాయ నియోజకవర్గ అబ్జర్వర్లు	
ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు టీచర్స్	కోన శశిధర్	9849904002
కడప, అనంతపురం, కర్నూలు	ఎం.హరిజవహర్‌లాల్	7702762347
	స్థానిక సంస్థలు అబ్జర్వర్లు	
శ్రీకాకుళం	హెచ్ అరుణ్‌కుమార్	7893291199
పశ్చిమగోదావరి	సురేష్‌కుమార్	8527595439
కర్నూలు	ముడావల్ ఎం.నాయక్	9440812345

నకిలీ ఓట్లు, డబ్బు పంపిణీపై చర్యలు తీసుకోండి

- చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ శాసనమండలి స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో అధికార పార్టీ పెద్దఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ నకిలీ ఓట్లతో, డబ్బు పంపిణీతో అక్రమాలకు పాల్పడుతోందని, నకిలీ ఓట్లను, డబ్బు పంపిణీని నియంత్రించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనాకు లేఖ రాశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో, తిరుపతి, నెల్లూరు ప్రాంతాల్లో పెద్దఎత్తున నకిలీ ఓట్లు వున్నాయని సిపిఎం గతంలో ఫిర్యాదు చేసిందని తెలిపారు. అనేక పర్యాయాలు ఉత్తరాల ద్వారా నకిలీ ఓట్లు పెద్దఎత్తున వున్నాయని ఆధారాలతో వివరాలు పంపామని వివరించారు. ఈ నకిలీ ఓట్లను ఓటర్లు కానివారితో వేయించుకునేందుకు అధికారపార్టీ సిద్ధమవుతోందని, తక్షణం ఈ అక్రమ ప్రక్రియను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఆధునిక సాంకేతికత, రవాణా సౌకర్యాలను ఉపయోగించి ఓటర్లకు నేరుగా డబ్బులను చేరవేస్తున్నారని వివరించారు. ఇందుకు వలంటీర్లను ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో బహిరంగంగా డబ్బుపంపిణీ జరుగుతున్నా ఎక్కడా ఎన్నికల యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పోలీసులకు ఫిర్యాదులు అందినా ఎక్కడా స్పందించడం లేదని తెలిపారు. ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థ నవ్వులపాలు కాకుండా, ఎలాంటి అక్రమాలు, ప్రలోభాలకు తావివ్వకుండా స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



దీక్షా శిబిరంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను తిప్పికొడతాం

- స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఐక్య పోరాటంతో తిప్పికొడతామని స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్షులు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 760వ రోజుకు చేరాయి. తొలుత దీక్షా శిబిరంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచుతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే రిజర్వేషన్లు అమలవుతాయని తెలిపారు. దీక్షల్లో పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్, నాయకులు కె.సత్యనారాయణ, వైటి.దాసు, మస్తానప్ప, హిందుస్తాన్ షిప్‌యార్డ్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కొండలరావు, ఎస్.సత్యనారాయణ, ఎల్‌వి.రమణరావు, మోహన్‌బాబు, పుల్లారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కిరణ్ కుమార్‌రెడ్డి రాజీనామా

ప్రజాశక్తి-అమరావతి 2బ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం తన రాజీనామా లేఖను ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు పంపారు. చిత్తూరు జిల్లాకు చెందిన కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్‌పార్టీ నుండి 1989 సాధారణ ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. తర్వాత 1994లో ఓడిపోయినా 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేలగా ఎన్నికయ్యారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ చీఫ్ విప్‌గా 2009లో అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతితో 2009 సెప్టెంబర్‌లో కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రి అయ్యారు. రోశయ్య 2011 జూన్‌లో రాజీనామా చేసిన అనంతరం స్పీకర్‌గా వున్న కిరణ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. 2014 ఎన్నికల వరకు ఆయన సిఎంగా బాధ్యతలు నిర్వహించారు. 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఆ తర్వాత సమైక్య ఆంధ్రప్రదేశ్ పార్టీని ఏర్పాటుచేసి 2014 ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ పార్టీ అభ్యర్థులెవరూ గెలవకపోవడంతో, చాలా కాలంగా రాజకీయాలకు దూరంగా వున్న కిరణ్‌కుమార్‌రెడ్డి ఇటీవలే తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్‌లో చేరినా యాక్టివ్ రాజకీయాలకు దూరంగా వుంటూ వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు బిజెపిలో చేరేందుకు కాంగ్రెస్‌కు రాజీనామా చేసినట్లు తెలిసింది. త్వరలో ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాను కలుస్తారని ప్రచారం జరుగుతోంది.

ఫలితం వచ్చేనా?

న్యూఢిల్లీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టీమ్ ఇండియా సొంతమవటం ఖాయమైంది. అహ్మదాబాద్ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో కొండంత స్కోరు ముందున్నా.. అలవోకగా ఆధిక్యం దక్కించుకుంది భారత్. మూడేండ్లుగా శతకం కోసం ఎదురుచూసిన విరాట్ కోహ్లి (186) సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. శుభ్‌మన్ గిల్ (128), అక్షర్ పటేల్ (79)లు సైతం మెరవటంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 571 పరుగులు చేసింది. చివరి టెస్టులో ఆస్ట్రేలియాకు పెద్దగా అవసరం లేదు. నెగ్గినా.. ఆ జట్టుకు సిరీస్ దక్కదు. కానీ భారత్‌కు అత్యవసరం. ఈ టెస్టులో విజయం సాధిస్తే ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో నేరుగా చోటు దక్కించుకోవచ్చు. లేదంటే శ్రీలంక, న్యూజిలాండ్ టెస్టు సిరీస్ ఫలితంపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే, అహ్మదాబాద్ టెస్టులో నాలుగు రోజుల ఆట ముగిసింది. 12 సెషన్ల ఆటలో రెండు ఇన్నింగ్స్‌లు మాత్రమే ముగిశాయి. ఇంకా రెండు ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. మరో మూడు సెషన్ల ఆట మాత్రమే మిగిలి ఉంది. ఈ మూడు సెషన్లలో ఆస్ట్రేలియా పది వికెట్లు పడగొట్టడంతో పాటు ఆ జట్టు నిర్దేశించిన లక్ష్యాన్ని భారత్ ఛేదించాలి. పిచ్ స్వభావం, స్పందిస్తున్న తీరు చూస్తే అది సాధ్యపడే పరిస్థితి లేదు. దీంతో భారత్, ఆస్ట్రేలియా నాల్గో టెస్టులో డ్రా తప్పదనిపిస్తుంది. చివరి రోజు పిచ్ పగుళ్లు తేలి స్పిన్‌కు అనుకూలిస్తే మినహా.. నేడు ఆటలో ఫలితం ఆశించే అవకాశం ఏమాత్రం లేదు.



డబ్బులు పంచుతున్న ఈశ్వరరావు (గళ్ల చొక్కా వ్యక్తి)ను పట్టుకుంటున్న పిడిఎఫ్ బృందం సభ్యులు

ఉరుకులు, పరుగులు

- సచివాలయాల ఎఎన్ఎంలపై పెరిగిన పని భారం
- ముఖఆధారిత అటెండెన్సు తప్పనిసరితో తీవ్ర ఇబ్బందులు
- గ్రామాల నుంచి మండల కేంద్రాలు, పిహెచ్‌సిలకు ప్రయాణ అవస్థలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తోన్న సచివాలయాల ఆరోగ్య కార్యకర్తలు (ఎఎన్ఎంలు) పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిభారంతో ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తోంది. ముఖ ఆధారిత హాజరును ప్రభుత్వం తప్పని చేయడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు టీకాలు వేయడం, జ్వరాల సర్వే చేయడం, ప్రాథమిక చికిత్సలు చేయించడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ప్రతి బుధవారం, శనివారం వ్యాక్సినేషన్, శుక్రవారం ఫ్రై డే-డ్రైడే పేరుతో పరిసరాల శుభ్రత చేయించడం, ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్సల కోసం రోగులను పిహెచ్‌సిలకు పంపడం, రెండు వారాలకు ఒకసారి పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులకు పరీక్షలు చేయడం, రక్తహీనత ఉంటే మందులు అందజేయడం వీరి విధి నిర్వహణలో భాగంగా ఉంది. లెప్రసీ కేసులు పరిశీలించడం, క్షయ సంబంధించి పరీక్షలు చేయించి మందులు అందజేయడం, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో పని చేయడం, రెండుసార్లు ఆయా గ్రామాల్లో రోగులకు అందుబాటులో ఉండి పరీక్షలు చేయించడం తదితర విధుల్లో నిమగ్నం అవుతున్నారు. ఆయుస్మాన్ భారత్ ద్వారా ఆయా గ్రామాల వివరాలు డేటా అప్‌లోడ్, అసంక్రమిత, సంక్రమిత వ్యాధులకు వేర్వేరుగా సర్వేలు చేయాలి. ప్రతి బుధవారం, శనివారం వ్యాక్సినేషన్ కోసం ఉదయం ఎనిమిది గంటల కల్లా పిహెచ్‌సికి వెళ్లి వ్యాక్సిన్ డోస్‌లు తీసుకోవాలి. తిరిగి పది గంటలకు గ్రామానికి వెళ్లి ముఖఆధారిత బయోమెట్రిక్ వేయాలి. తరువాత అవసరమైన వారికి వ్యాక్సిన్ అందించాలి. ఉదయం పది గంటల నుంచి రెండు గంటల్లోపు వ్యాక్సిన్ అందించి మిగిలిన వ్యాక్సిన్‌ను తిరిగి మధ్యాహ్నం మూడు గంటలలోగా పిహెచ్‌సిలకు అప్పగించాలి. ఫీవర్ సర్వేలు, ఇతర ఆరోగ్యపరమైన అంశాలపై ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలి. వీటికితోడు మండల, డివిజన్ కేంద్రాల్లో జరిగే సమావేశాలకు హాజరు కావడం, నిత్యం ప్రజల వద్దకు వెళ్లినప్పుడు యాప్‌లలో వివరాలు నమోదు చేయడం నిత్యకృత్యంగా మారింది. వీటితోపాటు మండల అధికారులు తాజాగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ బాధ్యతలు కూడా వీరికి అప్పగిస్తున్నారు. ఇళ్లు త్వరగా కట్టుకునే విధంగా చైతన్యపర్చాలని ఎంపిడిఒలు లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. ఇన్ని బాధ్యతలు ప్రభుత్వం అప్పగించడంతో పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాల్లో పనిచేసే ఇతర ఉద్యోగులకు ప్రభుత్వ సెలవులు అన్నీ వర్తిస్తున్నాయి. వీరికి మాత్రం సెలవులు వర్తించడం లేదు. శనివారం, బుధవారం పండగ వచ్చినా వ్యాక్సిన్ డ్యూటీ చేయాలి. గ్రామ సచివాలయాలలో ఉదయం పది గంటలకు, మధ్యాహ్నం నాలుగు గంటల లోపు, మళ్లీ ఐదు గంటలకు ముఖఅధారిత అటెండెన్సు వేసుకోవాలి. మండల పరిషత్తులలో జరిగే సమావేశాలకు హాజరైనా తిరిగి మళ్లీ గ్రామాలకు వెళ్లి ముఖఅధారిత అటెండెన్సు వేసుకోవాలని ప్రభుత్వం తప్పని సరి చేసింది. గత కొన్నేళ్లుగా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తోన్న ఎఎన్ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు చేసే బాధ్యతలన్నీ సచివాలయ వైద్య ఉద్యోగులతో చేయిస్తుండడంతో వీరిపై భారం పెరుగుతోంది. ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశాలు ఇవ్వడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. తమపై పని భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న సచివాలయాల ఆరోగ్య కార్యకర్త (ఫైల్ ఫొటో)

ఆగని ప్రలోభాలు

(మొదటిపేజి తరువాయి)

అతన్ని పట్టుకుని అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీతమ్మధార తహశీల్దారు శ్యాం కుమార్, ఎంవిపి పోలీసులు డబ్బులు పంచుతున్న ఈశ్వరరావును విచారించారు. 16వ వార్డులో ఓటర్లకు పంచేందుకు వైసిపి కార్యాలయంలో రూ.లక్ష నగదు ఇచ్చారని, ఓటరు లిస్టు అందజేసి, ఒక్కో పట్టభద్రునికీ రూ.వెయ్యి పంచాలని చెప్పారని నిందితుడు ఒప్పుకున్నట్టు తహశీల్దార్ తెలిపారు. 15 మందికి డబ్బులు పంచగా మిగిలిన రూ.85 వేలను తాము స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం అతన్ని ఎంవిపి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితుడు ఈశ్వరరావు విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు సంబంధించిన ఓ సంస్థలో ఉద్యోగి. తమ యాజమాన్యం చెప్పిన మేరకు పంచేందుకు వచ్చానని చెప్పాడు.

తిరుపతిలో పోలీసులు వదిలేశారు

తిరుపతి నగరంలోని సుందరయ్యనగర్, యశోదానగర్‌లో వాలంటీర్లతో కలిసి చైతన్య, అరుణ్ అనే వైసిపి కార్యకర్తలు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్లకు నగదు పంపిణీ చేస్తుండగా పిడిఎఫ్ కార్యకర్తలు పట్టుకున్నారు. వారిని పోలీసులకు అప్పచెప్పినా ఫలితం కనిపించలేదు. పోలీసులు వారిని వెంటనే విడిచిపెట్టేశారు.

బాపట్లలో ఓటుకు వెయ్యి

బాపట్ల జిల్లాలోని అనేక చోట్ల గ్రాడ్యుయేట్ ఓటర్లకు అధికారపార్టీ నేతలు డబ్బులు పంచారు. గ్రామ వాలంటీర్లను ఉపయోగించుకుంటూ ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సమాచారం. ఈపురిపాలెం పద్మనాభుని పేటతో పాటు ఇతర ప్రాంతాలలో వైసిపి నాయకులు ఆదివారం నాడు కూడా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. అదే సమయంలో ఓటర్లకు నగదు చెల్లించారని చెబుతున్నారు.

పంపిణీలోనూ ముఠాలు

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామంలో నగదు పంపిణీలో వైసిపిలోని ముఠాలు బయటపడ్డాయి. ఈ కార్యక్రమంలో పట్టు నిలుపుకోవడం కోసం వైసిపి నేతలే ఘర్షణకు దిగారు.గ్రామంలో మొత్తం 62 మంది పట్టభద్రుల ఓటర్ల కు ఎవరు డబ్బులు పంపిణీ చేయాలన్న విషయమై వివాదం చెలరేగింది. నాయకులు మూడు గ్రూపులుగా చీలిపోయి ఒకరినొకరు దూషించుకుంటూ ఘర్షణకు దిగారు.



తిరుపతి సుందరయ్యనగర్‌లో వైసిపి తరపున డబ్బులు పంపిణీ చేస్తున్న వ్యక్తి

సిబిఐ విచారణ వాయిదా

- ఐఒ అధికారి లేకపోవడంతో వైఎస్ భాస్కర్‌రెడ్డి తిరుగుముఖం

ప్రజాశక్తి - కడపప్రతినిధి

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి కడప సెంట్రల్ జైలులోని సిబిఐ అతిథి గృహంలో సిబిఐ విచారణకు ఆదివారం ఉదయం హాజరయ్యారు. సిబిఐ విచారణాధికారి అందుబాటులో లేకపోవడంతో విచారణ వాయిదా పడింది. దీంతో భాస్కర్‌రెడ్డి తిరుగుముఖం పట్టారు. సిబిఐ అతిథి గృహానికి పెద్దఎత్తున వైసిపి కేడర్ చేరుకుంది. బయటకు వచ్చిన అనంతరం వైఎస్ భాస్కర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

ఆరోగ్యం సహకరించకపోయినా విచారణ నిమిత్తం వచ్చానని, విచారణాధికారి లేకపోవడంతో తిరిగి వెళ్తున్నానని చెప్పారు. సిబిఐ అధికారులు విచారణకు మళ్లీ పిలుస్తామన్నారని, అప్పుడు మళ్లీ తప్పక హాజరవుతానని చెప్పారు. హత్య జరిగిన ప్రాంతంలో లభించిన లేఖ గురించి తేలాల్సి ఉందని, దీని గురించి తేల్చకుండా ఏ దర్యాప్తు సంస్థ కేసును పూర్తి చేయలేదని, అన్నింటికీ సిద్ధపడే విచారణకు హాజరయ్యానని ఆయన పేర్కొన్నారు.

పవన్‌కల్యాణ్ బిసి డిక్లరేషన్ అంతా ఫార్స్

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బిసిలు తలెత్తుకొని నిలబడేలా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశాలు కల్పిస్తే పవన్‌కల్యాణ్ పార్టీ పెట్టిన పదేళ్ల తర్వాత బిసిలను మభ్యపెట్టేలా బిసి డిక్లరేషన్ అని మాట్లాడుతున్నారని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పవన్‌కల్యాణ్ బిసి డిక్లరేషన్ అంతా ఫార్స్ అని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. బిసిలకు సామాజిక న్యాయంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని అన్నారు. చంద్రబాబు కనుసన్నల్లో వున్న పవన్‌కల్యాణ్‌కు బిసిల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. 2014 తర్వాత బిసిలకు ఇచ్చిన 125 హామీల్లో చంద్రబాబు ఏ ఒక్కటీ అమలు చేయకున్నా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సామాజిక న్యాయం చూసి ఓర్వలేకే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

30, 31వ తేదీల్లో తిరుమలలో శ్రీరామ నవమి ఉత్సవాలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30, 31 తేదీల్లో శ్రీరామనవమి, శ్రీరామ పట్టాభిషేకం వేడుకలను నిర్వహించనున్నామని టిటిడి అధికారులు వెల్లడించారు. మార్చి 30న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారని వివరించారు. సాయంత్రం 6:30 నుండి 8 గంటల వరకు హనుమంత వాహనసేవ జరగనుందని పేర్కొన్నారు. ఆ తరువాత రాత్రి 9 నుంచి 10 గంటల నడుమ బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తామన్నారు. ఈ కారణంగా సహస్రదీపాలంకార సేవను టిటిడి రద్దు చేసినట్లు తెలిపారు. మార్చి 31న రాత్రి 8 నుండి 9 గంటల వరకు బంగారువాకిలి చెంత ఆలయ అర్చకులు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

న్యాయమూర్తులు చట్టాలను పరిరక్షించాలి


- స్వార్థంతో కూడిన తీర్పులివ్వకూడదు
- జస్టిస్ బి.చంద్రకుమార్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నేరారోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులకు న్యామూర్తులు క్లీన్ చీట్ ఇచ్చి, అనంతరం ఉన్నత పదవులు పొందడం దారుణమని రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. చట్టాలను పరిరక్షించాల్సిన వారు ఇలా స్వార్థంతో కూడిన తీర్పులు ఇవ్వకూడదని, అధికారంలో ఉండి తప్పు చేస్తే ఆ ప్రభావం దేశ ప్రజలందరిపై పడుతుందని తెలిపారు. 'రాజ్యాంగ వ్యవస్థలు - పరిరక్షణ' అనే అంశంపై జన చైతన్య వేదిక ఆధ్వర్యాన గుంటూరులో ఆదివారం సదస్సు జరిగింది. వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జస్టిస్ బి.చంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు క్లీన్ చీట్ ఇచ్చిన న్యాయమూర్తి ఒకరు నేడు గవర్నర్‌గా నియమితులయ్యారని తెలిపారు.

కోలీజియంను రద్దు చేసి ప్రజాప్రతినిధులు న్యాయమూర్తులను నియమిస్తే దేశం సర్వనాశనం అవ్వడం ఖాయమన్నారు. చట్టసభల్లో ఎలాంటి చర్చ జరగకుండానే మూజువాణి ఓటింగ్‌తో చట్టాలు రూపొందిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్న శాసనమండలి ఎన్నికల్లోనూ ఓటుకు డబ్బులు ఇవ్వడాన్ని, తీసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 60 ఏళ్లలో చేసిన అప్పుల కంటే గత ఐదేళ్లలో చేసిన అప్పులే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు.

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ రావాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రంగయ్య, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, మానవతా చైర్మన్ రమేష్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు, విఆర్ఒ సంస్థ సెక్రటరి వేళ్లంగిని, ప్రముఖ న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, రజనీ, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కోట వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ బి.చంద్రకుమార్



పంట పొలాల్లో బైకులు నడుపుతూ నిరసన తెలుపుతున్న రైతులు

పంట చేలో బైకు ర్యాలీతో నిరసన

- సాగునీరు అందించకపోవడంపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

సాగునీరు సకాలంలో అందకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రాంటు గ్రామంలో బీడు బారిన పంట పొలాల్లో బైకు ర్యాలీతో వారు ఆదివారం నిరసన తెలిపారు. తాళ్లరేవు మండలంలో శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో నెల రోజులుగా రైతులు ఆయా ప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారు. ఆ సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వారితో మాట్లాడి సాగునీరందిస్తామని హామీలు ఇచ్చారు. అయినా సాగునీరు అందకపోవడంతో గ్రాంటు గ్రామంలో రైతులు ఈ విధంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. నెల రోజులుగా నీటిపారుదల శాఖ అధికారుల చుట్టూ, జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నా చుక్క నీరు అందించలేదన్నారు. దీంతో పంట పాడైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారని విమర్శించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్యం వల్లే తమకు సాగునీరు అందలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పి మల్లవరం సర్పంచ్ కుడుపూడి శివన్నారాయణ, ఎంపిపి రాయుడు సునీత, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఇరిగేషన్ ఎఇ ఈశ్వర్ రైతుల వద్దకు వచ్చారు వారితో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటాం

- బొప్పరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై వారికి అండగా నిలబడటంతోపాటు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఎపి రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం అన్ని డిపార్టుమెంట్ల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘ ప్రతినిధుల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వాలు జాప్యం చేస్తూ కాలయాపన జరిగిందని, ఇప్పటికైనా కాంట్రాక్టు ఉద్యోగుల దీన పరిస్థితిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని తక్షణమే క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలని, బడ్జెట్‌తో సంబంధం లేకుండా ఆర్థికేతర అంశాలైన మహిళా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు లీవులు, ఇతర సౌకర్యాల కల్పన లాంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఎపి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ కె.సుమన్, సెక్రటరీ జనరల్ భానూజీరావు, అన్ని జిల్లాల కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనులను అడవి నుంచి గెంటేసేందుకు బిజెపి కుట్ర

- ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ బాబూరావు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా)



గిరిజనులను అటవీ ప్రాంతం నుంచి గెంటేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం తంటికొండలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న అటవీ భూముల్లో బహుళజాతి కంపెనీల ప్రవేశానికి అటవీ చట్టాలు అడ్డంకిగా మారిన నేపథ్యంలో వాటిని మార్చేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. అటవీ ప్రాంతంలో లీనియర్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, పైపులైన్లను ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు నిర్మిస్తున్నాయని తెలిపారు. లీనియర్ ప్రాజెక్టుల నిర్మాణానికి గిరిజన గ్రామసభ అనుమతి అక్కర్లేదని 2013లో కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను 2019లో ఎపి హైకోర్టు కొట్టేసిందని తెలిపారు. గిరిజన గ్రామసభకు ఉన్న విస్తృత అధికారాన్ని న్యాయస్థానం గుర్తించడంతో ముసాయిదా బిల్లులో గ్రామసభను సంప్రదించాలని మాత్రమే కేంద్ర ప్రభుత్వం పేర్కొందన్నారు. అటవీ సంరక్షణ చట్టం 1980 ప్రకారం అటవీ భూమిని ఇతర ప్రయోజనాలకు వినియోగించాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా చట్టంలోని నిబంధనలు పాటించాలని తెలిపారు. గ్రామసభ అనుమతి తీసుకోవాలని, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, అడవులు పెంచడానికి ప్రత్యేక భూమి కేటాయించాలని చెప్పారు. ఈ నిబంధనలు కార్పొరేట్ శక్తులకు అడ్డుగా ఉండడంతో వాటిని సవరిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును కూడా పరిగణలోకి తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అటవీ భూముల వాడకంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రమాదకరమని పలువురు రాజకీయ, పర్యావరణవేత్తలు చెబుతున్నా నాగర్ కర్నూల్ జిల్లా అమ్రబాద్ నల్లమల ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు కేంద్రం సిద్ధపడిందని, గిరిజనులు, ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. దీంతో ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రపూరిత విధానాలను పోరాటాలతోనే తిప్పికొట్టాలని కోరారు.

స్మార్ట్ మీటర్లపై దృష్టి సారించాలి

- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్రప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఛైర్మన్ నుంచి లైన్‌మ్యాన్ వరకు ప్రచారం చేయాలని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ కోసం ఏటా రూ.8,400 కోట్లు రాష్ట్రప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. మీటర్ల ఏర్పాటు కోసం రూ.4వేల కోట్ల ఖర్చవుతుందని చెప్పారు. ఇందులో రూ.1600 కోట్లు కేంద్రప్రభుత్వం గ్రాంట్ రూపంలో ఇస్తుందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు మంచి ఫలితం ఇచ్చిందన్నారు. ప్రతి నెల 2.81 మిలియన్ యూనిట్ (ఎంయు) విద్యుత్ ఆదా చేసిందని పేర్కొన్నారు. 2020-21లో ప్రతి నెల సరాసరి వినియోగం 8.46ఎంయు ఉండేదని, ఇది 5.65ఎంయులకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో 16,66,282 మంది రైతులు ఉన్నారని, వీరిలో 16,55,915 మంది మీటర్ల ఏర్పాటుకు అంగీకారం తెలిపారని చెప్పారు. దేశంలోనే రాష్ట్ర విద్యుత్ రంగాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని రంగాల విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో సిఎండి బి శ్రీధర్, డిస్కంల సిఎండిలు పద్మ జనార్ధన రెడ్డి, కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు

డబ్బులు పంచుతుంటే ఇసి ఏం చేస్తోంది

- టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసన మండలి ఎన్నికల్లో ఒక్క ఓటుకు రూ.10 వేలు నుంచి 15వేలు డబ్బులు పంచుతుంటే ఎన్నికల కమిషన్ ఏం చేస్తోందని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ ఉందా? లేదా? అనే అనుమానం కలుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపిపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని తెలిపారు. అనేకమందిపై తాము ఫిర్యాదు చేసినా ఒకరిద్దరి దరఖాస్తులు మాత్రమే తీసుకున్నారే తప్ప అనేకచోట్ల పట్టించుకోలేదని విమర్శించారు. వైసిపికి ఓటమి భయం పట్టుకుందని, ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉందని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, వాలంటీర్లు డబ్బులు, మందు విచ్చలవిడిగా పంపిణీ చేశారని తెలిపారు. విశాఖలో ఎంపిపి డబ్బు పంపిణీ చేస్తూ పట్టుబడ్డా చర్యలు శూన్యమని పేర్కొన్నారు.

దొంగ ఓట్లపై కోర్టుకు వెళ్తాం : వర్ల

శాసన మండలి ఎన్నికలు అయిపోయినా దొంగ ఓట్ల ప్రక్రియపై కోర్టుకు వెళ్తామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. రాష్ట్రంలో ఓటు స్వేచ్ఛగా వేసుకునే పరిస్థితి కనపడటం లేదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ఒక ఫాల్స్‌గా మారిందని, ఒక ప్రహసనంగా తయారైందని విమర్శించారు. అనేకమంది అధికారులు, నాయకులు జగన్, ఆయన అనుయాయుల అభిప్రాయానికి మద్దతు పలకడం దురదృష్టకరమని అన్నారు. ఎస్‌పి, కలెక్టర్లు సైతం ఇలానే ఉన్నారని ఆరోపించారు. ఇలాగైతే ఎన్నికలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్ర బలగాలను దించాలని డిమాండ్ చేశారు.

మంత్రి ఉషశ్రీ చరణ్‌ను బర్తరఫ్ చేయాలి
టిడిపి మహిళ అధ్యక్షురాలు అనిత

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన మంత్రి ఉషశ్రీ చరణ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని టిడిపి మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. స్వయంగా మంత్రులే డబ్బుల పంపిణీకి దిగడం దారుణమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్లకు డబ్బుల పంపిణీ లెక్కలు చూస్తూ మంత్రి అడ్డంగా బుక్కయ్యారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోగస్ ఓట్లు

- 'వైసిపి'తో ఎన్నికల అధికారులు కుమ్మక్కు
- కేంద్ర ఎన్నికల సంఘానికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో పెద్దఎత్తున బోగస్ ఓట్లు చేర్చారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఆదివారం లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. వైసిపి నేతలతో పలుచోట్ల ఎన్నికల అధికారులు కుమ్మక్కు కావడంతో పెద్దఎత్తున బోగస్ ఓట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన బోగస్ ఓట్ల వివరాలను లేఖకు జత చేశారు. గతంలో తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో కూడా బోగస్ ఓట్ల తంతు నడిచిందని పేర్కొన్నారు. పట్టభద్రుల, టీచర్



ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా నేడు అదే పునరావృతం అవుతుందని తెలిపారు. తప్పుడు చిరునామాలతో వైసిపి అభ్యర్థికి అనుకూలంగా పెద్దసంఖ్యలో ఓటర్లను చేర్చారని పేర్కొన్నారు. తిరుపతిలో ఒకే ఇంటి చిరునామాతో పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున బోగస్ ఓట్లు చేర్పించారని తెలిపారు. ఎన్నికల అధికారులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కయ్యి నకిలీ డిగ్రీ సర్టిఫికెట్‌తో ఓటర్లుగా చేర్పించారని వివరించారు. కొందరు అధికారులు నకిలీ పత్రాలపై పరిశీలన జరపకుండానే, ఉద్దేశపూర్వకంగానే ఆమోదం తెలిపారని విమర్శించారు. తిరుపతిలో 44వ డివిజన్‌లో చికెన్ దుకాణం అడ్రస్‌తో కూడా 16 బోగస్ ఓట్లు నమోదు చేశారని, ఇలా పలు ప్రాంతాల్లో బోగస్ ఓట్ల తంతు ఉందని వివరించారు. ఈ ఓట్లపై విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి సంబంధిత జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. ఈ బోగస్, నకిలీ ఓట్లతో ప్రజాస్వామ్య విలువలకు, ప్రాథమిక హక్కులకు తీవ్ర నష్టమని పేర్కొన్నారు. ఈ కారణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని, అక్రమాలను అడ్డుకోవాలని కోరారు. బోగస్ ఓట్ల నమోదులో పాల్గొన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఓటమి భయంతో అక్రమాలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతో వైసిపి అక్రమాలకు పాల్పడుతోందని చంద్రబాబు నాయుడు విమర్శించారు. విశాఖలో వైసిపి కార్యకర్త డబ్బులు పంచుతూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన వీడియోను ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఒకవైపు బోగస్ ఓట్లు, మరోవైపు ఓట్ల కొనుగోలు... ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతో వైసిపి ఎంచుకున్న విధానమని విమర్శించారు. ఓటర్లు చైతన్యంతో వ్యవహరించి వైసిపికి బుద్ధి చెప్పాలని కోరారు.

అరటి అ'ధర'హో

టన్నుకు రూ.24 వేలు పలుకుతున్న ధర

ఎగువ రాష్ట్రాలకు పెరిగిన ఎగుమతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్, ఎగువ రాష్ట్రాల్లో అరటి దిగుబడులు లేకపోవడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం టన్ను అరటి ధర రూ.24 వేలకు చేరింది. గత సీజన్‌లో టన్ను రూ.16 వేల నుంచి రూ.18 వేలకు వరకూ పలికింది. ప్రస్తుతం అరటికి మంచి ధర ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లలో ఈ ధరే అత్యధికమని వారు చెబుతున్నారు. దేశంలో అత్యధికంగా అరటి సాగు జరిగే మహారాష్ట్ర, బీహార్, ఒడిశా, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో దిగుబడులు ఆశించిన స్థాయిలో లేవు. దీంతో, రాష్ట్రంలోని అరటికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది.

'తూర్పు', కోనసీమ జిల్లాల్లో విస్తారంగా సాగు



అరటి గెలలను మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీ పేట మండలాల్లో విస్తారంగా అరటి సాగవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాలు అరటి సాగుకు పెట్టింది పేరు. ఈ రెండు జిల్లాల్లో మరో ఎనిమిది మండలాల్లో అక్కడక్కడా అరటి సాగవుతోంది. అధికారుల గణాంకాల ప్రకారం ఈ రెండు జిల్లాల్లో సుమారు 45 వేల ఎకరాల్లో అరటి తోటలు ఉన్నాయి. ఈ సీజన్‌లో సుమారు ఎనిమిది లక్షల టన్నుల వరకూ దిగుబడి వస్తుందని అధికారుల అంచనా వేశారు. ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతోంది. 15 నుంచి 17 టన్నుల వరకూ దిగుబడి వస్తోంది.

ఈ లెక్కన ఎకరాకు రూ.2 లక్షల వరకూ లాభం రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ధర ఎంతకాలం ఉంటుందో చూడాలని వారంటున్నారు.

రోజూ 250 లారీలపై ఎగుమతి

రావులపాలెం, పెరవలి అరటి మార్కెట్లు ఉన్నాయి. ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఈ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. గతంలో వంద నుంచి 120 లారీల్లో ఇక్కడ నుంచి అరటిని ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో రోజుకు 200 నుంచి 250 వరకూ లారీల్లో అరటిని ఎగుమతి చేస్తున్నారు. ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కోల్‌కత్తా తదితర ఉత్తరాది రాష్ట్రాలకు ప్రతి రోజూ అరటి ఎగుమతులు జరుగుతున్నాయి.

ఆశాజనకం ధరలు



ఐదు ఎకరాల్లో కర్పూర రకం అరటి సాగు చేస్తున్నాను. పది రోజులుగా అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గతంలో టన్ను అరటి రూ.16 వేలు ఉండేది ప్రస్తుతం రూ.24 వేల వరకూ పలుకుతోంది. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరో నెల రోజుల పాటు ఈ ధరలు ఉంటాయని అంచనా. కొంతకాలంగా నష్టాల్లో ఉన్న అరటి రైతులకు ఈ ధరలు కొంత ఊరటనిచ్చాయి.

మద్దిపాటి జానకి, తీపర్రు, పెరవలి మండలం

విడి గెలలకూ పెరిగిన డిమాండ్



పెళ్లిళ్ల సీజన్ కావడంతో రావుల పాలెం, తాడేపల్లి గూడెం, రాజమహేంద్రవరం మార్కెట్లలోనూ విడి గెలలకుడిమాండ్ పెరిగింది.

ఒక అరటి గెల రూ.250 నుంచి రూ.300 చొప్పున పలుకుతోంది. గతంలో గెల రూ.100లోపునే అమ్ముకోవాల్సి వచ్చేది. ఏడాదిలో ఒక నెల మాత్రమే డిమాండ్ ఉంటుంది. ఇతర సమయాల్లో తక్కువ ధరకు విక్రయించక తప్పడం లేదు. ప్రభుత్వం అరటిని నిల్వ చేసుకునే సౌకర్యాలు కల్పించి రైతులను ఆదుకోవాలి.

దేవరపల్లి సత్యనారాయణ, తీపర్రు, పెరవలి మండలం



“ వెనక చూసిన
కార్యమేమోయ్?
మంచి గతమున
కొంచమేనోయ్
మందగించక ముందుకడుగేయ్
వెనకబడితే వెనకెనోయ్!”
– గురజాడ



కాగితం పడవలు

ఊరంతా... కవి సమ్మేళనాల జాతర
అసలు రాగాలే తెలియని కాకుల చేత
పాటలు పాడించాలని సంబరాల సంతకాలు
వాడిపోయిన వసంతానికి
అసత్యాల పూలజడలు అల్లుతూ..
చేదును మాత్రమే మిగిల్చుకున్న సామాన్యులకు
చినిగి ముక్కలైపోయిన తలపాగాలను
తలా జానెడు పంచుతున్నారు
గర్భస్రావం పొందుతున్న సందర్భాల నుంచి
పుట్టని బిడ్డకు అప్పుడే లాలపోసి
లాలిపాటలు పాడుతున్నారు...
తాకట్టుపెట్టిన మనసు మైదానాల మీద
అవాస్తవాల గంజాయి మొక్కల్ని పెంచుకుంటూ...
తాళం తప్పుతున్న కవితా గానాలతో
మనస్సాక్షికి మరణశాసనం రాసుకుంటున్నారు
వేషాలను అనుకరిస్తూ హాజరైన
కవులు కాని కవుల పగటివేషం
సభలోని అందరి చూపుల్ని కొనుగోలు చేస్తోంది
అబద్ధాల కవితల్ని.. పిచ్చోడి చేతిలోని రాయిలా
విసిరిన ప్రతిసారీ సాహిత్యపు నిలువుటద్దాన్ని
బద్దలు కొట్టే ప్రయత్నం జరుగుతోంది
చప్పట్ల శబ్దాలకు నిశ్శబ్దంగా
మురిసిపోతున్న ముఖాలు
అశాస్త్రీయ సాహిత్య శవపేటికల్ని
భుజాల మీద మోస్తున్నాయి
శాలువా, జ్ఞాపికల ఆనందంలో
మురిసిపోతున్న నవ్వులన్నీ
సమ్మేళనాల జాతరలో
తలలు తెగిన మేకపోతులవుతున్నాయి!
సన్మానాలకు మాత్రమే
పరిమితమవుతున్న కొన్ని కవి జన్మలు
తిరిగి ఏడాది నిద్రకు
సమాధులు నిర్మించుకుంటున్నాయి
ప్రజాసమస్యల అంచుల నుంచి
దూరంగా ఆలోచించే కవి ఎవరైనా
రేపటి కాలం వాకిళ్లకు
దిష్టిబొమ్మగా మాత్రమే మిగిలిపోతారు!
వేదికల సాక్షిగా అందుకునే సత్కారాల కోసం
వాస్తవాలను తీవ్రంగా ...
నిర్లక్ష్యం చేస్తున్న కవితా గానాలన్నీ
తడిస్తే చాలు, నిండా మునిగిపోయే
కాగితం పడవలు మాత్రమే ..!

– డా. కె.జి. వేణు
98480 70084

పోలిక

ఎవరు పోల్చారో
పోల్చుకున్నారో మొదటిగా
మనుషుల్ని వెంటాడుతోందది
మనసు మనసునీ మెలి పెడుతోంది
మనసంటూ లేని ఈ పోలిక
మనిషి మనిషికీ పోలిక
ఇంటికి ఇంటికీ పోలిక
ప్రతి అక్షరానికీ
మరో అక్షరంతో
క్షయం కాని పోలిక
కవిత కవితకీ పోలిక
పంక్తి పంక్తికీ పోలిక
కథ కథకీ పోలిక
కవి కవికీ పోలిక
అనవసర అసందర్భ అసహన పోలిక
కార్యకారణం కావ్యకారణం
లేని నిరంకుశ పోలిక
నిష్కారణ పోలిక
తెలుపుకి నలుపుకీ
తేడా తెలిసినా
మళ్ళీ కొత్త పోలిక
మరో మెలిక
పనిదినానికి విశ్రాంతికీ
అవిశ్రాంతంగా ఆవిష్కృతమయ్యే
అర్థంలేని పోలిక
నిద్రపోనివ్వని మేలుకోని
మస్తిష్కంలో ప్రతిదీ పోలికే
ఓ కొలిక్కి ఎప్పుడూ రాలేని
పోలికేక లాంటి నిశ్శబ్ద పోలిక
ఎందుకో మరి
మనిషి బతికున్నంతవరకూ
చంపుతోందీ పోలిక!

– జంధ్యాల రఘుబాబు
9849753298

చిన్న బిందువు


బురద మడుల్లో ఆడపడుచులు
చందమామల నడుముల్ని వంచి
వరినాట్లకు పాటల ఊపిర్ని పోస్తుంటే
చివర్లో
తియ్యటి పాటలు కాస్తాయనుకున్నా..!
కానీ,
ఎండిన, దిక్కుమాలిన రాకాసి కొమ్మకు
ఉరేసుకున్న దేశం కింద
ఏడుపై వస్తుందని
ఊహించలేకపోయాను!
‘ప్రపంచం పెద్ద ప్రశ్నార్థకం
తెగ నలిగిపోతున్న చిన్న బిందువు రైతు’!

పుడమి చేయితో
పచ్చజెండాను నిరంతరం ఊపుతూ
లోకాన్ని కదుపుతూ
కాలం గొంతులో
అన్నం ముద్దై అడ్డుపడుతున్నాడు
నీళ్ళ కోసం
ఆయాసంతో తహతహలాడిపోతున్నాడు
అధిరోహించే ప్రతి పర్వతం
అగ్నిపర్వతమవుతుంది
కార్పొరేట్ల ఫొటోలకు
ఉరితాళ్ళే అందమైన ఫ్రేములు...!
ఏ కొమ్మను చూసినా
గుండెలు తరుక్కుమంటున్నాయి...
రైతు పుడమిని సంతోషంగా
తనివి తీరా వాటేసుకోవాలని పోతే
అక్కడికక్కడే మాయమవుతున్నాడు
ఎండమావై ..!

– శిల్పి చంద్రశేఖర్
63050 50953

ఈతకోట ‘విశాల నయనం’

పుస్తకం



కవి, పాత్రికేయులు, చరిత్ర పరిశోధకులు, కథా రచయితగా ఈతకోట సుబ్బారావు అందరికీ సుపరిచితులు. ఆయన వచన కవిత్వానికి గుర్తింపుగా అనేక అవార్డులు కూడా అందుకున్నారు. సుబ్బారావు గారి సంపాదకత్వంలో విశాలాక్షి అనే మాసపత్రిక గత 13 సంవత్సరాలుగా వెలుగుతున్న సంగతి మనకు తెలుసు. ఆ మాస పత్రికలో ఆయన సంపాదకీయాన్ని వచన కవితగా రాయడాన్ని చాలాకాలంగా మనం చూస్తూనే ఉన్నాం. ఆ సంపాదకీయం ఆలోచించే విధంగా ఉంటుంది. సరికొత్త ఆలోచన రేకెత్తించేదిగా ఉంటుంది .భిన్నంగా ఉంటుంది. దినపత్రికలో వచ్చే సంపాదకీయానికి మాసపత్రికలో వచ్చే సంపాదకీయానికి తేడాలుంటాయి. సంపాదకీయాన్ని పత్రిక ఆత్మగా పేర్కొంటారు. .ప్రముఖ పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు గారు ‘అప్పుడే వండి, వార్చి వడ్డించిన అన్నం’గా సంపాదకీయాన్ని పేర్కొంటారు. అయితే ఇక్కడ సుబ్బారావు విశాలాక్షి పత్రికలో ఆ మాసంలో తనను కదిలించిన సంఘటన, సమకాలీన సమాజంలో చెలరేగిన ఆక్రందన, మరణించిన కవి గురించి, కురవని వాన గురించి, పండగ గురించి, రైతు గురించో, స్త్రీ గురించో కవితా రూపంలో సంపాదకీయం రాశారు. 13 సంవత్సరాలకు 160 వరకు సంపాదకీయాలు ఉంటాయి. వాటిలో ఎంపిక చేసిన వాటిని ఇటీవల ‘విశాల నయనం’ పేరుతో సంకలనంగా తీసుకొచ్చారు.

ఈ సంపాదకీయ కవిత్వంలో మనిషిలో పేర్కొన్న చెత్తని తొలగించడానికి ఈతకోట అక్షరాల చీపురుని కట్టాడు. మనసులో ఉన్న మురికి కాలవను శుభ్రం చేయడానికి పాటల బెత్తాల్ని సిద్ధం చేశాడు. తరతరానికి తుప్పు పడుతున్న మెదడు గదిలో దీపం పెట్టాలని మాటలని వత్తులుగా తయారు చేశాడు. సమూహానికి, సమూహానికి మనిషికి మనిషికి మధ్య ఏర్పడుతున్న అగాధాలను కలిపే వారధి కట్టే ప్రయత్నం చేశారు. ఇంకిపోయిన చిరునవ్వుల నదిలో నిలబడి కలంపారతో జలను తవ్వే ప్రయత్నం చేశాడు. గలీజ్ వాతావరణాన్ని శుభ్రపరిచే ప్రక్రియని భుజానికి ఎత్తుకున్నాడు. మమతల రహదారుల్లో అనురాగాల విత్తులు నాటాలని పిలుపునిస్తున్నాడు. ప్రపంచాన్ని ప్రేమభాషతో పలకరించాలని అక్షర హస్తాలతో మూసుకుపోయిన గుండె తలుపుల్ని తెరుచు కోవా లని ఆరాటపడుతున్నారు. ఈ సంపాదకీయాలు నిండా రేపటి వెలుతురు కలలు నింపాలనే ప్రయత్నం కనిపిస్తుంది.

ఇందులో అనుభూతి ప్రధానమైన వాక్యాలతో కూడిన సంపాదకీయాలు కూడా కొన్ని ఉన్నాయి. వర్షం నేపథ్యంలో ఓ మూడు నాలుగు సంపాదకీయాలను పరిశీలించినప్పుడు ‘ఒక వర్షం అనేక దశ్యాలు’ లో ఇలా అంటారు

“చినుకులు పడుతుంటే
ఆకాశం అన్నదానం చేస్తున్నట్లుంది
వాన కళ్లాపి చెందిన చెలక
తడిసిన రైతు దేహంలా మెరుస్తోంది
వానలో తలారా స్నానం చేసిన వృక్షాలు
తలలో చిరునవ్వు పూలు ముడుస్తాయి
నది దేహం పైన పులకరింత అయిన జల్లు
క్షణిక ముత్యాలను వెదజల్లుతుంది
ఒళ్లంతా నీటి చుర‌కైన వాన
నరాల్లో విద్యుత్ ప్రవహిస్తుంది
కనతల్లిలా పూవ్వుకు లాల పోస్తే వాన
చలిగాలి ఒళ్లంతా తుడుస్తుంది.

.... ఇలా అక్షరాలను పేర్చుకుంటూ సరాసరి మన గుండెల్లో వాన కురిపిస్తారు సుబ్బారావు. మానవత్వం మనిషి తత్వం నేపథ్యంలో ఇందులో అనేక సంపాదకీయ కవితలను మనం చూడవచ్చు. మనిషి వెలుతురు స్నానం చేయాల్సిన అవసరం గురించి సుబ్బారావు ఆక్రోశించారు. కోల్పోయిన మనిషి కోసం కౌగిలి సాచాల్సిన అవసరం గురించి ఆలోచించమంటారు. మన కపాలాలపై పూసుకున్న చీకటి మైలని తొలగించుకోవడానికి వెళుతున్నాను అని తీర్మానం చేస్తారు. ముక్కలై పోతున్న మనుషులందరూ కలవాలని కోరుకుంటారు.

“చీకట్లోంచి వెలుతురుకు ప్రస్తావించే చోట
కన్నీటి నుంచి చిరునవ్వుకు పయనించే చోట
తలవాకిట ఆహ్వాన గీతం రచించే చోట
మనిషిని మనిషి ఆత్మాలింగనం చేసుకుంటూ
మనిషి చిరునామా వెతుక్కుందాం.”

కరోనాకాలంలో వలస కార్మికుల బాధల గురించి, దుఃఖం గురించి మనమంతా కవితలు రాశాము. సుబ్బారావు సజీవ పాదాలు అనే పేరుతో రాసిన కవిత కాస్త విభిన్నంగా ఉంటుంది.

“బ్రహ్మ కడిగిన పాదం చూళ్ళేదు
బలి మోపిన వామన పాదం చూళ్ళేదు
కైలాసంలో తాండవ పాదం చూళ్ళేదు” మరి కవి ఏ పాదాలు చూసాడు? ఎలాంటి పాదాలు చూసాడు? కొండల్లో కోనల్లో, అడవుల్లో ఎడారుల్లో రస్తాలు పరిచిన పాదాలను చూశాడు. చీరుకు పోయి పుండ్లు పడి రసి కారుతున్న పాదాలను చూశాడు. ఆకలికి నకనకలాడే పాదాలను చూశాడు. నీళ్ళు లేక పెదవులు చీరుకుపోయిన పాదాలను చూశాడు. కమిలిపోయిన కన్న తల్లిపాదాలను చూశాడు. పల్లేరు మీద నడక సాగిస్తున్న నిరుపేద పాదాలను చూశాడు. “నేలతల్లి మలాము పెదవులతో ముద్దాడుతున్న / మొరటు వలస పాదాలను చూశాను” అంటాడు.

మనకు బాగా దగ్గరైన వాళ్ళు మనల్ని ప్రభావితం చేసినవాళ్లు శాశ్వతంగా వెళ్లిపోయినప్పుడు కన్నీరు కారుస్తాం. బాధపడతాం. వేదన చెందుతాం. సుబ్బారావు గారు కూడా కన్నీరు కార్చారు కాకుంటే కలంతో. ఈ సంపాదకీయాల్లో చాలా భాగం వరకు నివాళి కవితలు ఉన్నాయి. ఆ నివాళి కవితల్లో మరణించిన వారి ఆత్మ మనకు కనిపిస్తుంది, హృదయం మనకు వినిపిస్తుంది. ఎస్పీ బాలసుబ్రమణ్యం గారి స్మృతిలో రాసిన కవిత ‘పాటకు వేళయింది’. బాలు పాటకు ఎలా ప్రాణం పోసేవాడో, అతని సరాగ సంతకం ఆత్మలు తనివితీరా ఎలా ఆస్వాదించేవో, శ్రోతల దాహాన్ని ఆ స్వర జలపాతం ఎలా తీర్చేదో, అతని నాదం కోటి కోటి హృదయాల దేవాలయాల్లో సరిగమల దేవిగా ఎలా కొలువైందో ఆ కవితలో గొప్పగా ఆవిష్కరించారు.

“పాట ఎగిరిపోయింది/ భువన భవన విశ్వాంతర సోపానాల్లోకి పాట ఎగిరిపోయింది/ గీతానికి సంగీతానికి జుగల్బందీ కూర్చిన పాట/ సామాన్యుడి నోట శంకరాభరణమై పలికిన పాట/ పదాలకి నవరసామృతం రంగరించిన పాట / లింగాష్టకాన్ని నింగిలో నిలిపిన పాట/ దేవి దేవతలను భూమికి దింపిన పాట / ఎన్నో పాత్రలకు ప్రాణదానం చేసి చేసి అలసి సొలసి విశ్వాంతర వినువీధుల్లో పాట నిద్రపోతుంది”

దిగంబర కవి మహా స్వప్నకి, ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవికి నివాళిగా రాసిన ‘మరణం ఒక స్వప్నం జీవితం ఒక మెలకువ’ అనే కవిత స్మృతి కవితలలో వచ్చిన గొప్ప కవిత. అందులో ఆయన చెప్పిన వాక్యాలు పరిశీలిస్తే ... “కొందరు మరణంలో పుట్టి జీవితంలో మరణిస్తారు మరికొందరు జీవితంలో పుట్టి జీవిస్తూ మరణిస్తారు.. మరణించినా జీవిస్తుంటారు.. మరణం ఒక స్వప్నం జీవితం ఒక మెలకువ” ఈ విధంగా సుబ్బారావు మండేలా, పెద్దిబొట్ల, సోమ సుందర్, సినారె, మల్లి మస్తాన్ బాబు, ఎండ్లూరి సుధాకర్, అక్కినేని లాంటివారు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళినప్పుడు వారిని స్మరించుకుంటూ రాసిన వాక్యాలు గుర్తించదగినవి గా ఉన్నాయి.

మొదటి వాక్యం నుండి చివరి వాక్యం వరకు చదువుతున్న కళ్ళను పెదాలను, హృదయాన్ని చివరి వాక్యం వరకు తీసుకెళ్లి చకితుల్ని చేయడం ఇతని అక్షరాలకున్న ఆకర్షణగా కనిపిస్తుంది. జాలర్లకు వేట నిషేధ సమయాన్ని నిషిద్ధ రుతువుగా రికార్డు చేశారు. “అలలపై వలలు నిషేధం/ శ్రమజీవుల కలల కబేళాలపై/ ఉదయకిరణాల అడుగుల నిషేధం/ సముద్ర ఉద్యాన వనమాలి జాలరి / అయినా జల పుష్పాల సేకరణ నిషేధం/ ఇది నిషిద్ధ రుతువు కాబోలు/ చిరునవ్వుల జాతరకి మూడు మాసాల నిషేధం/ ఈ మూడు మాసాలు ఉప్పునీటి కన్నీళ్ళ సంగమమే”


ఈ విధంగా సుబ్బారావు ఏ వస్తువు తీసుకున్నా ఏ సంఘటన తీసుకున్నా కవిత్వాన్ని నిర్లక్ష్యం చేయకుండా రాసుకుంటూ పోయారు. సాయి పల్లవి, సోనుసూద్ లాంటి కళాకారుల మీద జరిగిన దాడి గురించి ప్రశ్నించారు. పెగాసస్ ఉదంతాన్ని నిక్కచ్చిగా రాస్తూ “చెట్టుకి రక్షణ లేదు/ పిట్టకు రక్షణ లేదు/ మట్టికి రక్షణ లేదు/ మనిషికి రక్షణ లేదు/ సాయిబాబాకి రక్షణ లేదు/ వరవరరావు కైనా తప్పలేదు/ రాజ్యం చేసిన పౌరపాటును/ ప్రభువులే ఒప్పుకోవటం లేదు/ దేశ జనాభా గుట్టు మట్టులన్నీ/ పెగసిస్ గుప్పెట్లో బందీలయ్యాక / దేశ రక్షణకే విలువలేదు” అంటూ రెక్కల గుర్రంతో చేసే రాజకీయ క్రీడను చూపారు.


ఇవాళ మనిషిని అనేక పాస్వర్డ్‌లతో కార్డులతో నంబర్లతో పోల్చుకుంటున్న వేళ సుబ్బారావు గారు దేవుని ఆధార్ కార్డు అడిగారు. ఈ కవిత్వంలో ఆవేశంతో పాటు వ్యంగ్యం కొత్త అందాన్ని తెచ్చిపెట్టింది. హనుమంతుడు ఎక్కడ పుట్టాడో అనే అంశంపై స్వామీజీల మధ్య చెలరేగిన వివాదాన్ని ‘స్వామి ఒకటివ్వు’ అనే శీర్షిక ద్వారా రాసిన సంపాదకీయ కవితతో సుబ్బారావు సమాధానం చెప్పారు. ఈ సంపాదకీయ కవిత్వాన్ని చదవడం ద్వారా మనం కొన్నిసార్లు నవ్వుకుంటాం కొందరిని తిట్టుకుంటాం. మనల్ని మెరుగుపరుచుకుంటాం. కొత్త ప్రశ్నలను కొన్ని సమాధానాలను వెతుక్కుంటాం. ఈ విశాల నయనం సంపాదకీయ కవిత్వాన్ని సాహిత్యకారులతోపాటు ప్రజలందరూ ఆదరించాలని ఆకాంక్షిస్తూ సుబ్బారావు గారికి అభినందనలు.

– డాక్టర్ సుంకర గోపాలయ్య

ఏభై ఏళ్ళనాటి సీరపాణి ‘జీవన వసంతం’

సందర్భం





చైత్ర, వైశాఖ మాసాలు వసంత ఋతువు. ఏడాదిలో వచ్చే ఆరు ఋతువుల్లోనూ మొదటిది. ‘ఋతువుల రాణి వసంత ఋతువు’ అని అన్నారు మన కవులు. వసంతాన్నే ‘ఋతురాజు’ అని కూడా కొనియాడారు కొందరు కవులు. నూతన సంవత్సర ఆహ్వానాన్ని మానవాళి చేత అందుకునే సౌభాగ్యశాలిని. ఏది ఏమైనా కొత్త సంవత్సరానికి స్వాగత ద్వారం వసంతం. ప్రముఖ అభ్యుదయ కవి ‘సీరపాణి’ జీవన వసంతం అనే కవిత ద్వారా మానవ జీవితంలోకి వసంతాన్ని ఇలా ఆహ్వానిస్తున్నారు.

‘శిశిర హిమ యవనికలు శీర్ణమై, జీర్ణమై
నవ మధూదయ స్వర్ణరాగ సంకీర్ణమై
గలిత పాదప శుష్క పత్ర సంరంభమై
లలిత నవ వల్లికా పల్లవారంభమై
అంతరించెను గతము ప్రళయ సంకేతమై
అవతరించెను నవత ప్రణవ సంగీతమై’ అనే చరణాల్లో కవి ‘నవత’ ఎలా ఆవిర్భవించిందో చెబుతున్నారు. శిశిర ఋతువులోని మంచు తెరలు శిథిలమై, కనుమరుగై మధూదయాన్ని సూచించే స్వర్ణకాంతులు దట్టంగా వ్యాపించాయి. పండుటాకులను గలగలా రాల్చివేసి, చెట్లు, లతలు కొంగొత్త చిగురుటాకులతో శోభిల్లుతున్నాయి. ప్రళయ సంకేతంగా గతం అంతరించిపోయి, నిత్య నూతనమైన సృష్టిగా నవత అవతరిస్తోందట.

ఈ సందర్భంగా కవి కాలం యొక్క స్వరూప స్వభావాలను దిఙ్మాత్రంగా సూచిస్తున్నారు.

‘కాలమొక నిత్య నూతన ఇంద్రజాలం
సుఖ దుఃఖ సంకలిత మణి ప్రవాళం
కాలమొక గంభీర జలధి, నిర్వేలం
రాత్రిందివాల రంగుల ప్రకృతి చేలం’

కళ్ళముందు కదలాడుతున్నా ‘కాలం’ నిత్య నూతన ఇంద్రజాలం వంటిదనీ, సుఖదుఃఖాలనే మణులు, పగడాలు కలగలిపి కూర్చిన హారం వంటిదని వర్ణిస్తారు. కాలమనేది లోతు తెలియని, గట్టు లేని సముద్రం వంటిది. రాత్రింబవళ్ళనే వెలుగునీడల రంగుల వస్త్రం ఆచ్ఛాదనగా కలిగినదనీ, దాని బాహిర రూపాన్ని స్ఫురింపజేస్తున్నారు. ఊహకందని కాలం గురించి ఇలా నిర్వచించగలగడం సామాన్యమైన విషయమేమీ కాదు. ఇది కవి రచనా చమత్కృతికి నిదర్శనం.

‘కాలమొక సింధువు, బ్రతుకొక్క బిందువు
కాలమొక మేరువు, జీవితము రేణువు
ఈ ఇరుకు బ్రతుకులో ఇంత క్రౌర్యమ్మా
మానవత్వం మాపునంత ధైర్యమ్మా’ అని మానవ జీవితం ఎంత సూక్ష్మాతి సూక్ష్మమైనదో కవి తెలియజేస్తున్నారు. అత్యంత అల్పకాలికమైన బతుకులో ఇంత క్రూరత్వమా! మానవత్వాన్నే మంటగలిపేటంతటి సాహసమా! అని మనిషిలోని అమానుషత్వాన్ని తీవ్రంగా గర్హిస్తున్నారు కవి.

‘మనుషులను ప్రేమించు వాడెపో నరుడు
అది ఎరుంగనివాడు అవని యమకింకరుడు’ ఇలా సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని చాటి చెప్తున్నాడు ఈ కవన ప్రేమికుడు. ఇంకా ఇలా అంటున్నాడు ...:

‘ఒక హిమాలయ భూధరోత్తుంగ శృంగమై
ఒక క్షీర సాగరోచ్ఛరదురు తరంగమై
సౌజన్య సౌహార్ధముల నాట్య రంగమై
ప్రతి మనిషి జీవితం పరిఢవిల్లాలి’ ఇలా చైతన్యంగా ఉండాలని అంటూ ప్రతి మనిషి జీవితం ఒక హిమాలయ పర్వత శిఖరంలా ఉన్నతంగా ఎదగాలి. ఒక పాలసముద్రం నుండి ఎగసిపడే కెరటంలా సౌజన్యము, సౌహార్ధము అనే సుగుణాలు నటించే నాట్య రంగంలా పరిఢవిల్లాలని ఆకాంక్షిస్తున్నారు.

‘యుగయుగమ్ముల ధ్వాంత పటలి నశియింపగా
జడ జగతిలో నూత్న తేజమ్ము నింపగా
నైరాశ్యమును కూల్చి, దారిద్ర్యమును డుల్చి
బ్రతుకులో చైతన్య మురళి రవళింపగా’ అనే చరణాల్లో తరతరాలుగా మానవజాతిని కమ్ముకొని వస్తున్న అజ్ఞానము, అసమానత్వము అనే దట్టమైన చీకట్లు చెల్లాచెదురు కాగా, స్తబ్దమైన ప్రపంచ గమనంలో కొత్త కాంతులు నింపుతూ, నిరాశను మరియు పేదరికంను పటాపంచలు చేసి, జీవితాల్లో చైతన్య మురళీ రవాలు నినదించేటట్లుగా నవవసంతం జగతికి రాబోతోందని కవి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

‘అరుణ కిసలయ వసన మల్లికా దరహసన
పిక రసన నవవసంతం జగతి కరుదించె
జీవన రసాల శాఖాభ్యంతరము నుండి
అభ్యుదయ పుంస్కోకిలోద్గీతి నినదించె’

ఆగామి వసంతం అరుణారుణ పల్లవాలతోను, మల్లికల దరహాసంతోను వస్తోందట. ఆ శుభా గమనాన్ని కవి ఇంకా ఇలా వర్ణిస్తున్నారు. జీవితమనే మామిడి చెట్టు కొమ్మలమాటున దాగి అభ్యుదయం అనే పుంస్కోకిల గీతాలాపన ద్వారా ఎలుగెత్తి చాటుతోందట.

వసంతాగమనాన్ని ఆసరా చేసుకుని కవి ఈ గేయంలో దగ్గోచరం కాని కాలం యొక్క స్వరూప స్వభావాలను ఒడిసి పట్టి మనకు చూపిస్తారు. సుదీర్ఘమైన కాలగమనంలో మానవ జీవితం ఎంత స్వల్పమైనదో నిర్వచిస్తారు కూడా. ఇంకా మనిషి స్థానాన్ని ఎరుకు పరుస్తారు. ఈ విషయాన్ని గుర్తించి మనిషి దానవత్వాన్ని విడిచి పెట్టాలంటారు. ఇంకా మనిషి ఎంత ఉదాత్తంగా తన జీవితాన్ని ఉన్నత ఆశయాల వైపు పయనింపజేయాలో కూడా సూచిస్తున్నారు. ఈ గేయం ఆసాంతం పరిస్తే, నిండుగాను గంభీరంగాను ఉంటుంది. అయితే ఈ కవిత సామాన్య పాఠకులకు అర్థం చేసుకోవడం కొంత కష్టం కావచ్చు. ఈ విషయం సీరపాణి గారి వద్ద ప్రస్తావిస్తే, ఆయన సమాధానం ఇలా ఉంది. ‘మన కావ్యాల్లోనూ, ప్రబంధాల్లోనూ ఉన్న భాషా ప్రౌఢిమ, భావగాంభీర్యమూ గేయ కవిత్వంలో కూడా చూపించవచ్చును అనేందుకు నిదర్శనంగా నా గేయ రచన ప్రారంభ దశలో ఈ గేయాన్ని ఈ శైలిలో రాశాను’.

ఈ గేయం సీరపాణి గారి ‘డమరుధ్వని’ అనే కవితా సంపుటి లోనిది. దీన్ని 1972 ఫిబ్రవరిలో రచించారు. ఈ గేయానికి 50 వసంతాలు పూర్తయ్యాయి. హైదరాబాద్ వంశీ ఆర్ట్స్ వారు 1975లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవిత్వపు పోటీలో ప్రథమ బహుమతి గెలుపొందింది ఈ కవిత. ఈ పోటీకి డాక్టర్ సి.నారాయణరెడ్డి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ కవిత రాసే కాలానికి సీరపాణి వయస్సు సుమారు 22 సంవత్సరాలు. నవ యౌవనంలో నవనవోన్మషంగా అందించిన నవ్య కవితగా ఈ గేయకైతను అభివర్ణించవచ్చు. ఇలాంటి అద్భుత గేయాలను పాఠ్యాంశాలుగా చేర్చాల్సిన అవసరముంది.

– పిల్లా తిరుపతిరావు
70951 84846



జేగురు రంగు కన్నీటి బొట్టు

ఆకాశాన్ని నేలమట్టం చేసే ఆయుధాలు
ధగ ధగా మెరుస్తున్నాయ్
గింజలు ముక్కున కరిచి ఎగిరేంతలో
ఆకలిని లుప్తం చేసేసిన పొగ చారల మధ్య
తెగిపడ్డ పిట్టల గుండెలు
గింజుకులాడుతున్నాయ్

వ్యవసాయ క్షేత్రంగా మనలేని పొలాలన్నీ
యుద్ధ క్షేత్రంగా మారక తప్పదని
చావులో.. బతుకు అనివార్యతేమిటో
కాలిబూడిదైన కంకులు బోధిస్తున్నాయ్

బిడ్డలు కావాలని చీమలు పెట్టిన గుడ్లు
బాంబుల సెగల్లో పేలిపోగానే
అవిటి చీమల చీము నెత్తురు కెరటాల్లోంచి..
పిగిలినగుడ్ల మండే గుండెసొనల్లోంచి..
పుట్టలు పుట్టలుగా డ్రోన్లు పుట్టుకొస్తున్నాయ్

సరిహద్దుల కనురెప్పల మీద కంపించి కంపించీ
తనను తాను నిభాయించుకోలేక
రెప్పపాటు విరామాల్లో
బూడిద గుట్టల మీద తేట పడుతోంది గాలి!

కన్నీరు మున్నీరుగా పొగిలే మట్టిబెడ్డల గుండెపై
నెత్తుటి తలగడ మీద తలవాల్చి
శవ పేటికల చుట్టూ పూడ్చిన సంతాప
దుక్కుల్ని శ్వాసిస్తోంది నేల!

పచ్చగడ్డి గమనించకపోలేదు దు:ఖపాతాన్ని –
ప్రతి పిడుగుపాటుకూ
మోకాళ్ళ మీద కూలబడి
కాస్తంత శక్తి కూడదీసుకుని నిటారుగా లేచి
నిప్పుల దండుకు ఎదురు నిలిచే
సరికొత్త వ్యూహాన్ని మోహరిస్తోంది

కాలు దువ్వడానికైనా.. కాచుకోవడానికైనా..
హేతువు దొరికి తీరుతుంది!
దొరకనిదల్లా,
రెప్ప మూయడం మరిచిన దేహాల మీద
నెత్తీనోరా మొత్తుకుని రోదించే
లేచివుళ్ల పండుటాకుల భీతి గుండెల శోకాన్ని
అచ్చంగా కొలిచే తూనిక రాళ్ళే!
యుద్ధం –
ప్రతి ప్రాణం పిట్ట కంటి నుంచి జారే
జేగురు రంగు కన్నీటి బొట్టు
యుద్ధం –
మానవాశల పూల సమాధి పక్కనే
తెరుచుకునే సరికొత్త ‘సార్కోఫాగస్’ దుకాణం!
యుద్ధం –
భూగోళాన్ని కాజేసే ఒక పాత వాణిజ్య వ్యూహం!
యుద్ధాన్ని ఓడించడం
యుద్ధోన్మాదుల్ని జయించడం
మూడో సహస్రాబ్దికిపుడు మొట్ట మొదటి బాధ్యత!


– కంచరాన భుజంగరావు
94415 89602

క్రాంతిపథం

చుట్టూ చీకటే అలముకొని ఉంది
ఇంకా తిట్టుకుంటూ కూచోకు
ఏ మూలనో ధగధగలాడుతున్న
చిరుదీపపు వెలుగు శ్వాసల్ని గుర్తించు
రెండు చేతులూ కలిపి కదిలి
క్రాంతి దారిని నిర్మించు ...

అటు స్వార్థం బుసలు కొడుతోంది
అధికారం రంకెలేస్తోంది
కట్టు తెగిన కట్టలు గెలుపును హూంకరిస్తున్నాయి
ఎక్కి తొక్కటానికి నీ భుజాలను అప్పగిస్తావో
గెలిచి నిలవటానికి సన్నద్ధమవుతావో ...

ఒక్కసారే వస్తుంది వెలుగుల వసంతం



దిక్కులు పిక్కటిల్లే నీ గెలుపునకు అవకాశం
చీకట్లో చిక్కుకోని చైతన్య ప్రవాహమే
రేపటి క్రాంతుల కదన కుతూహలం!

– శాంతిమిత్ర

16న మంటు కథల సంపుటి ‘అనార్కలి’ ఆవిష్కరణ

సాదత్ హసన్ మంటు కథల సంపుటి ‘అనార్కలి’ ఆవిష్కరణ సభ ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాదులోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో జరుగుతుంది. సభలో ఈ కథలని అనువాదం చేసిన అమ్జద్‌తో పాటు జూలూరు గౌరీశంకర్, ఏనుగు నరసింహారెడ్డి, రాపోలు సుదర్శన్, ఎ.కె. ప్రభాకర్: యాకూబ్, అబ్దుల్ వాహెద్, రూప్‌కుమార్ డబ్బీకార్ ప్రసంగిస్తారు.

– పాలపిట్ట బుక్స్



సదస్సులో మాట్లాడుతున్న భారత మానసిక వైద్య సంఘం జాతీయ అధ్యక్షులు రాజు

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు

- భారత మానసిక వైద్య సంఘం జాతీయ అధ్యక్షులు రాజు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సెమినార్

ప్రజాశక్తి-పాడేరు (అల్లూరి సీతారామరాజు)

పరీక్షల్లో సత్ఫలితాలను సాధించేం దుకు విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా మనసుపెట్టి ఇష్టపడి చదవాలని భారత మానసిక వైద్య సంఘం జాతీయ అధ్యక్షులు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎన్ఎన్ రాజు విద్యార్థినులకు ఉద్బోధించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు బాలికల గురుకుల కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షలలో మంచి ఫలితాలు – మార్గాలు అనే అంశంపై గిరిజన విద్యార్థులకు శనివారం సాయంత్రం సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్త ఎన్ఎన్ రాజు మాట్లాడుతూ, పరీక్షలంటే విద్యార్థినుల లలో సహజంగా ఉండే భయాన్ని, ఆచరించాల్సిన నియమాలకు సూచనలను వివరించారు. భయం, ఒత్తిడికి గురి కాకుండా ఆరోగ్యకర అలవాట్లపై వివరించారు. ఖాళీ సమయాల్లో ఆటపాటలు, రాయడం, చదవడం సంగీతం వినడం వంటి అలవాట్లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని ఆయన సూచించారు. పరీక్షలప్పుడు సమయాన్ని వృధా చేసుకోకుండా నిర్ణీత కాలాన్ని గమనంలో పెట్టుకుని చదివితే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆందోళన విడిచిపెడితే చదివినవన్నీ గుర్తుంచుకొని పరీక్షల్లో బాగా రాయగలుగుతారని ఆయన చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షలకు ముందు నుంచే చదివితే మంచి ఫలితాలు సాధించ వచ్చునని తెలిపారు. చదువు పట్ల ఏకాగ్రత, ప్రశాంతత చాలా అవసరమన్నారు. మంచి లక్ష్యాలు నిర్దేశించుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలన్నారు. చదవడం, రాయడం, గ్రూపు చర్చలతో ఎక్కువగా జ్ఞాపకశక్తి ఉంటుందన్నారు. ఏదైనా ఉద్యోగం సాదించాలంటే గట్టిగా సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బి.నరేష్, పి.వరహాలు, మండల నాయకులు మాణిక్యం, మత్స్యరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

థాయిలాండ్‌లో తీవ్రంగా వాయుకాలుష్యం

- వారం రోజుల్లో లక్షల మందికి అస్వస్థత

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో గాలి నాణ్యత రోజు రోజుకు దిగజారుతోంది. గత వారం రోజుల్లో వాయుకాలుష్యం కారణంగా దేశంలో సుమారు 13 లక్షల మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో రెండు లక్షల మంది ఆస్పత్రుల్లో చేరినట్లు అక్కడి ఆరోగ్యశాఖ తెలిపింది. వాహన కాలుష్యం, పరిశ్రమలు విడుదలచేసే కర్బనఉద్గారాలు, పంట వ్యర్థాలు తగలబెట్టడం వల్ల వెలువడే పొగ కారణంగా థాయ్ రాజధాని బ్యాంకాక్‌లో గాలి నాణ్యత తీవ్రంగా పడిపోయింది. దీంతో పిల్లలు, గర్భిణీ స్త్రీలు బయటకు రావద్దని థాయ్ ఆరోగ్య శాఖ ప్రజలకు సూచించింది.

"గత మూడు రోజులుగా బ్యాంకాక్‌లో 50 జిల్లాల్లో పీఎం 2.5 స్థాయిలు నమోదయ్యాయి. గాలిలో ఉండే అతి సూక్ష్మ ధూళి కణాలు మనిషి రక్తంలో కలిసిపోయి శరీర అవయవాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. ప్రస్తుతం దేశంలో వాయు కాలుష్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలను దాటిపోయింది. అందుకే ప్రజలను ఇంటి నుంచే పనిచేయాలని, బయటకు వచ్చేప్పుడు ఎన్95 మాస్కులు ధరించాలని సూచించాం. పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా వారిని ఎక్కువ సమయం బయటకు పంపొద్దని తల్లిదండ్రులను కోరాం. పాఠశాలలతోపాటు, పార్కులు వంటి చోట్ల నో డస్ట్ రూమ్ పేరుతో ఎయిర్ ప్యూరిఫైర్లను ఏర్పాటు చేశాం" అని థాయ్ ఆరోగ్య శాఖ తెలిపింది. బ్యాంకాక్ తర్వాత చియాంగ్ మై నగరంలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. ఇక్కడ ఎక్కువ శాతం మందికి వ్యవసాయం ప్రధాన వృత్తి. దీంతో ఈ ప్రాంతంలో పంట వ్యర్థాలను ఎక్కువగా తగలబెడుతుండటంతో వాయు కాలుష్యం పెరిగిపోయింది. కాగా, వాయుకాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా గాలి నాణ్యతను పెంచేందుకు థాయ్‌లాండ్ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.

మార్క్స్ వర్ధంతి సందర్భంగా 14న చర్చా గోష్టి

ప్రజాశక్తి- ఏలూరు

ప్రపంచ మేధావి, తత్వవేత్త కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా 14వ తేదీన చర్చా గోష్టి నిర్వహిస్తున్నట్లు ఏలూరులోని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, హేలాపురి చైతన్య వేదిక కన్వీనర్ కె.రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారొక ప్రకటన విడుదల చేశారు. నేటి సామాజిక అశాంతులు, ఆవేదనల నేపథ్యంలో కారల్ మార్క్స్ జీవితం, ఆయన చూపిన పరిష్కారాలు, మార్గాల గురించిన చర్చ ప్రపంచం అంతా జరుగుతోందని తెలిపారు. మార్క్స్ వర్ధంతిని పురస్కరించుకుని 'మార్క్స్ జీవితం, మార్క్సిజం, ప్రాధాన్యత, విశిష్టత' అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని సిఐటియు జిల్లా ఆఫీస్‌లో 14వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు వీడియో క్లిప్పింగ్ ప్రదర్శనతో ప్రారంభం అవుతుందన్నారు. ఏలూరు పరిసర ప్రాంతాల ప్రజాసంఘాలు, వివిధ పార్టీలు, స్వచ్ఛంద సేవాసంస్థల వారు పాల్గొనాలని కోరారు.

లోకేష్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదు

- ఎంపి మార్గాని భరత్ రామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

లోకేష్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదని, అందుకే చంద్రబాబు ఆయన దత్తపుత్రుడిని ఆశ్రయించాల్సి వస్తోందని ఎంపి మార్గాని భరత్ రామ్ ఎద్దేవా చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎంపి కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం జగన్ రియల్ హీరో అన్నారు. ఆయన్ని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదన్నారు. చిత్తూరు జిల్లాలో లోకేష్ 'అయోమయ గళం' పేరుతో పర్యటిస్తున్నాడన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసినా చిత్తూరు జిల్లాలో ఎలాంటి విలువ లేదంటే అర్థం చేసుకోవచ్చన్నారు. చిత్తూరు జిల్లాలో ఎక్కడి నుంచైనా తనతో పోటీ చేయమని మిథున్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించే దమ్ము, ధైర్యం లోకేష్‌కు ఉందా? అని ఎంపీ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలందరి హృదయాలను గెలుచుకున్న జగనన్న ఎప్పుడూ సింహమేనని, రియల్ హీరోయేనని ఎంపీ భరత్ అన్నారు. గాంధీ దండి మార్చ్, ఉప్పు సత్యాగ్రహం సమయంలో ఎలా అడుగులు వేశారలో ఇప్పుడు సిఎం జగన్ ఈ రాష్ట్రాన్ని 'స్వార్థ శక్తుల' చేతుల్లోకి పోకుండా కాపాడేందుకు తగిన అడుగులు వేస్తున్నారన్నారు. సినిమాలు వేరు నిజ జీవితం వేరు అని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ఎంపీ వ్యాఖ్యానించారు. బిసిల పట్ల కల్లబొల్లి మాటలు ఎందుకు అని ప్రశ్నించారు.

అమిత్ షా పర్యటనలో వినూత్న హోర్డింగులు



హైదరాబాద్ : కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో వినూత్న పోస్టర్లు, హోర్డింగులు వెలిశాయి. వాషింగ్ పౌడర్ నిర్మా .. వెల్‌కమ్ టు అమిత్ షా అంటూ.. గుర్తుతెలియని వ్యక్తులు అమిత్ షా పర్యటిస్తున్న మార్గాల్లో పోస్టర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. నిర్మా సర్ఫ్‌తో బట్టలపై మరకలు మాయమై పోయినట్లు.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు బిజెపిలో చేరితే వారికి అంటిన మరకలు కూడా పోతాయని చురకలంటించారు. నిర్మా అడ్వర్‌టైజ్‌లో కనిపించే అమ్మాయి ముఖం స్థానంలో బిజెపిలో చేరిన హిమంత బిశ్వశర్మ, నారాయణ్ రాణె, సువేందు అధికారి, సుజనాచౌదరి, జ్యోతిరాదిత్య సింధియా, ఈశ్వరప్ప సహా పలువురు నేతల ఫొటోలను ఉంచారు. ఎంఎల్‌సి కవితకు మద్దతుగా " బైబై మోడీ" అంటూ హైదరాబాద్‌తోపాటు ఢిల్లీలో శనివారం పోస్టర్లు, ఫ్లెక్సీలు వెలిసిన సంగతి తెలిసిందే.



నేటి నుంచి ఫీవర్ సర్వే

- ఫ్లూ తీవ్రతపై అప్రమత్తం
- ఎక్కువ మందికి జ్వరముంటే ఆసుపత్రికి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం జిల్లాలో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రుల్లో చేరిన వారూ పెరుగుతున్నారు. ఫ్లూ తీవ్రతకు హెచ్3ఎన్2 వైరస్ వ్యాప్తి కారణమేమోనని అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అన్ని రాష్ట్రాలను ఫ్లూ జ్వరాల పట్ల అప్రమత్తం చేసింది. పెరుగుతున్న ఫ్లూ కేసులపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. ఫలితంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం పది రోజుల పాటు జిల్లాలో గ్రామ గ్రామాన ప్రత్యేక వైద్య బృందాలతో ప్రతి ఇంటికీ వెళ్లి ఈ సర్వే చేపట్టనున్నారు. ఏ ఇంట్లో ఎందరు జ్వర పీడితులు ఉన్నారో గుర్తించి, వారికి తక్షణం వైద్య పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జ్వరం బారిన పడిన వ్యక్తి లక్షణాలు పరిశీలించి రక్త పరీక్షలు చేయించడం ద్వారా మలేరియా, డెంగ్యూ కారణమా లేదా వైరస్ బారిన ఏమైనా పడ్డారా? అనేది తెల్సుకున్నారు. సర్వే ద్వారా ఫ్లూ జ్వరాల వ్యాప్తి నివారించడంతో పాటు కొత్త వైరస్‌గా అనుమానిస్తున్న హెచ్3ఎన్2 గురించి కూడా ముందుగానే తెలుసుకునేలా కసరత్తు చేస్తున్నారు. వాస్తవానికి గడచిన కొన్ని వారాలుగా జిల్లావ్యాప్తంగా జ్వరాలు పెరిగిపోయాయి. జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి తదితర లక్షణాలతో ఆస్పత్రులకు చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రితో పాటు ప్రయివేటు ఆస్పత్రులకు జ్వర పీడితులు వస్తున్నారు. ఒక్క జిజిహెచ్‌కు రోజూ వందకు పైగా జ్వరంతో వణుకుతూ వస్తున్నారు. అదే సమయంలో ఫ్లూ ప్రపంచ వినియోగస్తున్న నేపథ్యంలో కొత్త వైరస్ వేరియంట్ ప్రభావం ఉండేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కేంద్రం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేయడంతో వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఫీవర్ సర్వే చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర బాధితులను గుర్తించనున్నారు. తద్వారా కొత్త వేరియంట్‌గా అనుమానిస్తున్న వైరస్‌కు సంబంధించిన లక్షణాలు బయటపడే అవకాశం ఉందని అంచనా వేశారు. సోమవారం నుంచి ఆయా సచివాలయాల పరిధిలో వాలంటీర్, ఎఎన్ఎం, ఆశావర్కర్లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికీ వెళ్లనున్నారు. పది రోజుల్లో జిల్లావ్యాప్తంగా అన్ని కుటుంబాల వద్దకు వెళ్లి ఫీవర్ సర్వే పూర్తి చేయనున్నారు. గతంలో కోవిడ్ వ్యాప్తి సమయంలో జరిపిన సర్వేలు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని, అందువల్ల అదే తరహాలో ఫీవర్ సర్వే నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి జ్వరంతో ఆయా కుటుంబాల్లో ఎంతమంది బాధపడుతున్నారో తెలుసుకుని లక్షణాల ఆధారంగా పరీక్షలు చేయించనున్నారు. ప్రస్తుతం జ్వరాల తీవ్రత చిన్నారులు, వృద్ధుల్లో మరింత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఏదైనా ఇంట్లో ఒకటికి మించి ఎక్కువ మందికి జ్వరాలు ఉంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ఆస్పత్రులకు పంపించేందుకు సిద్ధమవుతున్నారు.

17న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా

- జయప్రదం చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 17వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు ఆర్.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు సిబ్బందికి హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్సులు అమలు చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జిఒ నెంబర్ 7 ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ సిబ్బందికి పెండింగ్ డిఎలు, సరెండర్ లీవ్ వేతనాలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పర్మినెంట్ కార్మికులు, క్లాప్ ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా పర్మినెంట్ చేయడం లేదని, సిపిఎస్ రద్దు చేయలేదని వారు విమర్శించారు. ఈనెల 14 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసేందుకు, సిపిఎస్ రద్దు కోసం నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 17వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ల వద్ద మున్సి పల్ కార్మికుల ధర్నాలు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. మున్సిపల్ పర్మినెంట్ సిబ్బందికి ఏడు పెండింగ్ డిఎలు ఇవ్వాలని, సరెండర్ లీవుల వేతనాలు చెల్లిం చాలని, జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని, సిపిఎస్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని వారు కోరారు. ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్సులు అమలు చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని, ఆదివారం సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నట్లు వారు తెలిపారు. కలెక్టరేట్ వద్ద ధర్నాలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు చెందిన పర్మినెంట్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, క్లాప్ ఆటో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఢిల్లీలో దారుణం

- వీధికుక్కల దాడిలో అన్నదమ్ములు మృతి

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోనూ వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కల దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు మరణించడం కలకలం రేపింది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే వేర్వేరు ఘటనల్లో ఇవి చోటుచేసుకోవడం ఆ ఇంట్లో తీవ్ర విషాదం నింపింది. ఒక కేసు దర్యాప్తు చేస్తున్న సమయంలో రెండోది చోటుచేసుకోవడంతో గమనార్హం.

నైరుతి ఢిల్లీలోని వసంత్ కుంజ్‌లో ఉన్న రుచి విహార్ ప్రాంతమది. అటవీ స్థలంలో అక్రమ కొందరు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. అందులో నివాసముండే ఆనంద్ (7) అనే బాలుడు శుక్రవారం మధ్యాహ్నం ఆడుకునేందుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బాలుడి తల్లి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడ వెతకడం ప్రారంభించారు పోలీసులు.. బాలుడి తల్లితో కలిసి చిన్నారి కోసం గాలించారు. రెండుగంటల తర్వాత సమీపంలో ఉన్న ఓ ఖాళీ స్థలంలో బాలుడి మృతదేహం లభ్యమైంది. ఆతడి శరీరంపై గాయాలున్నట్టు గుర్తించిన పోలీసులు.. శవపరీక్షకు పంపించగా జంతువుల దాడిలో చనిపోయినట్టు ప్రాథమికంగా తేలింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫోరెన్సిక్ నిపుణులు, పోలీసుల బృందాలు ఆ ప్రాంతంలో ఎక్కువగా వీధి కుక్కల దాడులు పెరిగాయని.. ఆ క్రమంలోనే ఆనంద్‌పైనా దాడి చేసి చంపేసినట్టు నిర్ధారణకు వచ్చారు.

ఇది జరిగిన రెండు రోజుల తర్వాత ఆనంద్ సోదరుడు ఆదిత్య (5), మూత్రవిసర్జన కోసం తన స్నేహితుడితో కలిసి గుడిసె నుంచి కొంతదూరం వెళ్లాడు. తిరిగి వచ్చేందుకు ప్రయత్నించే సమయంలోనే ఆతడిని కొన్ని కుక్కలు చుట్టుముట్టాయి. అది చూసి భయపడిన తోటి స్నేహితుడు పరుగెత్తుకు వచ్చి ఆదిత్య ఇంట్లో తెలియజేశాడు. అప్పటికే అవి బాలుడిపై దాడి చేయడంతో ఆదిత్యకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఆనంద్ కేసు విచారణ జరిపేందుకు అక్కడకు చేరుకున్న వసంత్ గంజ్ పోలీసులు.. ఆదిత్యను వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఈ బాలుడు కూడా ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు వెల్లడించారు. ఇలా రెండు రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబంలోని ఇద్దరు చిన్నారులు వీధి కుక్కలకు బలికావడం ఆ ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

విమానంలో ధూమపానం చేసిన వ్యక్తిపై కేసు

ముంబయి : ఎయిర్ ఇండియా విమానంలో బాత్రూమ్‌లో ధూమపానం చేయడంతో పాటు ఇతర ప్రయాణికులతో అనుచితంగా ప్రవర్తించిన అమెరికా పౌరుడిపై కేసు నమోదు చేసినట్లు ముంబయి పోలీసులు ఆదివారం తెలిపారు. మార్చి 11న విమానంలో ప్రయాణికులకు అసౌకర్యానికి గురిచేసినందుకు రమాకాంత్ (37) పై ముంబయిలోని సహార్ పోలీస్ స్టేషన్‌లో ఐపిసి సెక్షన్ 336 ప్రకారం కేసు నమోదు చేసినట్లు ముంబై పోలీసులు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ. 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్ / కార్పొరేషన్ బ్యాంక్ ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇప్పుడు ఈ ఖాతాలు అస్సెట్ రికవరీ బ్రాంచ్ (ARB), విజయవాడకు బదిలీ చేయబడినవి, అధీకృత అధికారి దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ తాకట్టుదారుల ఆస్తులను స్వాధీనపర్చుకున్నారు. దిగువ తెలిపిన ఆస్తులు "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికన దిగువ పేర్కొన్న బకాయిలు మొత్తము మరియు ఇతర ఖర్చుల రికవరీ కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ వారికి ఇ-వేలం అమ్మకం ద్వారా ది. 28-03-2023న అమ్మకం చేయబడును. ఇట్టి ఆస్తుల వివరాలు దిగువ ఇవ్వబడినవి.

1) ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1) మెస్సర్స్ శ్రీ విజయదుర్గ ఆయిల్ ప్రోడక్ట్స్ ప్రై.లి., మేనేజింగ్ డైరెక్టర్ : శ్రీ బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. డైరెక్టర్ : శ్రీమతి బాలమూరి సునీత, భర్త : బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. మెస్సర్స్ శ్రీ విజయదుర్గ ఆగ్రో ఇండస్ట్రీస్, ప్రొ॥ బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. మెస్సర్స్ శ్రీ విజయదుర్గ పౌల్ట్రీస్, పార్టనర్ : శ్రీ బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. పార్టనర్స్ : 1) శ్రీమతి బాలమూరి సునీత, భర్త : బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. 2) శ్రీ బాలమూరి జోష్ణ లక్ష్మరావు, తండ్రి : బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. హామీదారులు : 1) శ్రీ బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. 2) శ్రీమతి బాలమూరి సునీత, భర్త : బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. 3) శ్రీమతి బాలమూరి సరోజినీదేవి, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి. 4) శ్రీ బాలమూరి జోష్ణ లక్ష్మరావు, తండ్రి : బాలమూరి వేణుగోపాలరావు, డి.నెం. 16-160బి, మెటల్ డెయిర్ ఎదురుగా, కొవ్వలివారిపేట, నూజివీడు - విస్సన్నపేట రోడ్డు, నూజివీడు - 521201, కృష్ణా జిల్లా, ఎపి.

బకాయి మొత్తం : అకౌంట్స్ : 1) మెస్సర్స్ శ్రీ విజయదుర్గ ఆగ్రో ఇండస్ట్రీస్ బకాయి ది. 31-10-2022 నాటికి రూ. 4,57,50,470.20/- (అక్షరాలా నాలుగు కోట్ల యాభై ఏడు లక్షల యాభై వేల నాలుగు వందల డెబ్భై రూపాయల ఇరవై పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు. **2) మెస్సర్స్ శ్రీ విజయదుర్గ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రై.లి. బకాయి ది. 31-10-2022 నాటికి రూ. 7,50,85,861.90/- (అక్షరాలా ఏడు కోట్ల యాభై లక్షల ఎనభై ఐదు వేల ఎనిమిదివ ందల అరవై ఒక్క రూపాయి తొంభై పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు. **3) మెస్సర్స్ శ్రీ విజయదుర్గా పౌల్ట్రీస్ బకాయి ది. 31-10-2022 నాటికి రూ. 1,94,01,268.06/- (అక్షరాలా ఒక కోటి తొంభై నాలుగు లక్షల ఒక్క వేయి రెండు వందల అరవై ఎనిమిది రూపాయల ఆరు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : ఆస్తి నెం. 1 : కృష్ణా జిల్లా, నూజివీడు, తిరువూరు రోడ్డు, ఆర్.ఎస్.నెం. 174/2, 174/3, 174/4, 180/2, 180/3, 180/4, 180/5, 180/6 & 192/2సి వద్ద ఎకరా 13.0275 సెంట్ల విస్తీర్ణంలోని ఫ్యాక్టరీ బిల్డింగ్ & పౌల్ట్రీ షెడ్ (మెస్సర్స్ శ్రీ విజయదుర్గ పౌల్ట్రీస్) మరియు ఇతర బిల్డింగ్ మరియు పౌల్ట్రీస్‌కి చెందిన ఖాళీ స్థలము.

ఎ) శ్రీ బాలమూరి వేణుగోపాలరావు గారి పేరిట కృష్ణా జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు టౌన్ నందు మొత్తం ఎకరా 8.01 సెంట్లు అందలి ఆర్.ఎస్.నెం. 174/2 (ఎకరా 0.30 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 174/3 (ఎకరా. 0.11 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 174/4 (ఎకరా 0.11 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/2 (ఎకరా 0.66 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 180/3 (ఎకరా 1.46 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/4 (ఎకరా 2.15 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 180/5 (3.22 సెంట్లు) అందలి ఉత్తర భాగాన గల సింగిల్ ప్లాట్ ఎకరా 4.00 సెంట్ల డ్రై ల్యాండ్. **హక్కులు : తూర్పు :** ఎన్ రాహుల్ చౌదరి ల్యాండ్ & డొంక, **దక్షిణం :** బి. పాపారావు గారి విక్రయించిన మిగిలిన ల్యాండ్ ఎకరా 4.01 సెంట్లు, **పడమర :** ఎన్. కాలయ్య & టి. కృష్ణారావు గార్ల భూమి, **ఉత్తరం :** ఎన్. కాలయ్య & ఎన్. రాహుల్ చౌదరి గార్ల భూమి.

బి) శ్రీ బాలమూరి వేణుగోపాలరావు గారి పేరిట కృష్ణా జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు టౌన్ నందు మొత్తం ఎకరా 8.01 సెంట్లు అందలి ఆర్.ఎస్.నెం. 174/2 (ఎకరా 0.30 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 174/3 (ఎకరా. 0.11 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 174/4 (ఎకరా 0.11 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/2 (ఎకరా 0.66 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 180/3 (ఎకరా 1.46 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/4 (ఎకరా 2.15 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 180/5 (3.22 సెంట్లు) అందలి దక్షిణ భాగాన గల సింగిల్ ప్లాట్ ఎకరా 2.01 సెంట్ల డ్రై ల్యాండ్. **హక్కులు : తూర్పు :** బాలమూరి సరోజినిదేవి గారి భూమి, **దక్షిణం :** బాలమూరి పాపారావు గారి భూమి, **పడమర :** ఎన్. కాలయ్య & టి. కృష్ణారావు గార్ల భూమి, **ఉత్తరం :** ఎన్. కాలయ్య & ఎన్. రాహుల్ చౌదరి గార్ల భూమి.

సి) శ్రీ బాలమూరి వేణుగోపాలరావు గారి పేరిట కృష్ణా జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు టౌన్ నందు మొత్తం ఎకరా 8.01 సెంట్లు అందలి ఆర్.ఎస్.నెం. 174/2 (ఎకరా 0.30 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 174/3 (ఎకరా. 0.11 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 174/4 (ఎకరా 0.11 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/2 (ఎకరా 0.66 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 180/3 (ఎకరా 1.46 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/4 (ఎకరా 2.15 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 180/5 (3.22 సెంట్లు) అందలి దక్షిణ భాగాన గల సింగిల్ ప్లాట్ ఎకరా 2.00 సెంట్ల డ్రై ల్యాండ్. **హక్కులు : తూర్పు :** బాలమూరి సరోజినిదేవి గారి భూమి, **దక్షిణం :** బాలమూరి సరోజినీదేవి గారి భూమి, **పడమర :** బాలమూరి సరోజినీదేవి గారి భూమి, **ఉత్తరం :** బాలమూరి పాపారావు గారి భూమి.

డి) శ్రీ బాలమూరి వేణుగోపాలరావు గారి పేరిట కృష్ణా జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు టౌన్ వద్ద ఆర్.ఎస్.నెం. 180/2 (ఎకరా 0.40 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 180/3 (ఎకరా 0.57 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 174/4 (ఎకరా 0.11 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 180/2 (0.66 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/3 (ఎకరా 1.46 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/4 (ఎకరా. 0.37 సెంట్లు), ఆర్.ఎస్.నెం. 180/5 (ఎకరా 0.19 సెంట్లు) అందలి ఎకరా 1.53 సెంట్లు సింగిల్ ప్లాట్ కి చెందిన డ్రై ల్యాండ్. **హక్కులు : తూర్పు :** డొంక, **దక్షిణం :** బాలమూరి వేణుగోపాలరావు గారి భూమి, **పడమర :** టి. కృష్ణారావు గారి భూమి, **ఉత్తరం :** డొంక మరియు టి. కృష్ణారావు గారి భూమి.

ఇ) శ్రీ బాలమూరి వేణుగోపాలరావు గారి పేరిట కృష్ణా జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు టౌన్ వద్ద ఆర్.ఎస్.నెం. 180/6 (ఎకరా 1.20 సెంట్లు) ఆర్.ఎస్.నెం. 192/2సి (ఎకరా 0.24 సెంట్లు) చెందిన ఎకరా 1.44 3/4 సెంట్లు సింగిల్ ప్లాట్ డ్రై ల్యాండ్. **హక్కులు : తూర్పు :** టి. నాగేంద్రరావు గారి భూమి, **దక్షిణం :** జాయింట్ పాసేజ్ & టి. నాగేంద్రరావు, **పడమర :** జాయింట్ పాసేజ్, టి. నాగేంద్రరావు గారి భూమి & బాలమూరి పాపారావు గారి భూమి, **ఉత్తరం :** దున్నపోతుల రామారావు గారి భూమి & తీగల నాగేశ్వరరావు గారి భూమి.

ఫీజులు కట్టలేదన్న నెపంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లను కళాశాల యాజమాన్యాలు నిరాకరిస్తే సంబంధిత కళాశాలలపై క్రిమినల్ చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యా సంవత్సరం కోల్పోయేటట్లు ఫిర్యాదు వస్తే, ఆయా కళాశాలల గుర్తింపును రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను మానసికంగా ఫీజుల పేరిట వేధిస్తున్నట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఉటువంటి చర్యలు యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షల నిర్వహణలో ప్రతి కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు, వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు లేకపోవడం పైనా ఫిర్యాదు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్, ఎస్పి, ఆర్ఐఓ, డిఇఓలకు లేఖ జారీ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టోల్ ఫ్రీ నెంబర్ 1800 4257635 తో పాటు apscpcr2018@gmail.com కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అక్రమాస్తుల జాబితా బయటపెట్టండి...

- ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్



న్యూఢిల్లీ : 'ల్యాండ్ ఫర్ జాబ్స్' కేసులో రూ.600 కోట్ల విలువజేసే ఆస్తుల్ని గుర్తించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చేసిన ఆరోపణల్ని ఆర్జేడీ నేతలు కొట్టిపారేశారు. ఒకవేళ అదేగనుక నిజమైతే..ఆ అక్రమాస్తుల జాబితాను ఇడి వెంటనే బహిర్గతం చేయాలని ఆర్జేడీ నాయకులు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్ డిమాండ్ చేశారు. బీహార్, ఉత్తరప్రదేశ్, ముంబయి..తదితర చోట్ల ఆర్జేడీ నాయకుల ఇళ్లపై సోదాల్లో రూ.600 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు గుర్తించినట్లు ఇడి పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపై మీడియాలో వచ్చిన వార్తలపై తేజస్వీ యాదవ్ ఆదివారం స్పందించారు. '2017లో ఇలాగే రూ.8వేల కోట్లు అక్రమ లావాదేవీలున్నాయని ఆరోపణలు వచ్చాయి. గురుగ్రాంలో వైట్‌ల్యాండ్‌కు చెందిన అర్బన్ క్యూబ్ ఆస్తుల విలువ వేలకోట్లుగా పేర్కొన్నారు. మళ్లీ అదే కంపెనీ, దాని ఆస్తులపై కొత్త ఆరోపణలు నమోదయ్యాయి. రూ.600 కోట్లు ఉన్నాయని ఇడి చెబుతోంది. పాత కేసుల ఆరోపణలకు ఆధారాలు ఎక్కడివో బిజెపి చెప్పాలి" అని తేజస్వీ యాదవ్ అన్నారు. "పుకార్లతో ప్రజల్ని తప్పుదోవపట్టించే బదులు, సోదాల్లో గుర్తించిన అక్రమాస్తుల జాబితాను బిజెపి ప్రభుత్వం విడుదల చేయాలి. ఇడి దాడుల తర్వాత పంచనామా ఉంటుంది. దానిని బహిర్గతం చేయండి" అని ట్విట్టర్‌లో సందేశాన్ని పోస్ట్ చేశారు.

ఇడి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నితీశ్ రానా రాజీనామా



న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నితీశ్ రానా తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆదివారం మీడియాకు తెలిపారు. 2015 నుంచీ ఇడి స్పెషల్ పిపిగా పనిచేస్తున్న ఆయన, దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాదిగా కోర్టులో వాదనలు వినిపిస్తున్నారు. రాజకీయంగా పెను సంచలనం సృష్టించిన పి.చిదంబరం, కాంగ్రెస్ నాయకుడు డి.కె.శివకుమార్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు, టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ, రాబర్ట్ వాద్రా..మొదలైనవారి ఇడి కేసుల దర్యాప్తుల్లో కీలక పాత్ర పోషించారు. జమ్ముకాశ్మీర్ తీవ్రవాదుల నిధుల కేసులో లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌పై ఇడిఆరోపణలు నమోదుచేయగా, ఈ కేసుల్లో ఆయన న్యాయవాదిగా ఇడి తరపున పనిచేశారు. అంతేగాక ఎయిర్ ఇండియా కుంభకోణం, విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, భూషన్ ఉక్కు, రాన్‌బాక్సీ రెలిగేర్ మోసం, పశ్చిమ బెంగాల్‌లో పశువుల అక్రమ తరలింపు కేసుల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. '2020 న్యాయ ప్రముఖుల్లో అత్యంత శక్తివంతుడి'గా నితీశ్ రానాను ఫోర్బ్స్ మ్యాగజైన్ పేర్కొంది.

పంజాబ్‌లో ఒకే రోజు 813 తుపాకీ లైసెన్సులు రద్దు

అమృతసర్ : రాష్ట్రంలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న తుపాకులకు అడ్డుకట్ట వేయాలని పంజాబ్ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో మొత్తం 3,73,053 తుపాకీ లైసెన్సులు ఉన్నాయని, తుపాకీ సంస్కృతిని అంతమొందించేందుకు తాము నిరంతరం చర్యలు తీసుకుంటామని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 813 తుపాలకు సంబంధించిన లైసెన్సులను రద్దుచేసింది. దీంతో ఇప్పటివరకు రద్దుచేసిన లైసెన్సుల సంఖ్య 2 వేలకుపైగా చేరింది. తాజాగా లైసెన్సులను రద్దుచేసిన వాటిలో ఎస్‌కేఎస్ కస్బా ప్రాంతంలోనే 235 తుపాకులు ఉన్నాయి. లూథియా రూరల్‌లో 87, షహీద్ భగత్‌సింగ్ నగర్‌లో 48, గుర్దాస్‌పూర్‌లో 10, ఫరీద్‌కోట్‌లో 84, పఠాన్‌కోట్‌లో 199, హోషియాపూర్‌లో 45, కపుర్తలాలో 6, సంగ్రూర్‌లో 16 తుపాకులు ఉన్నాయి. వీటితోపాటు అమత్‌సర్ కమిషనరేట్ పరిధిలోని 27 మంది, జలంధర్ కమిషనరేట్‌లో 11, ఇతర జిల్లాల్లో మరికొంత మందికి తుపాకీ వినియోగానికి ఇచ్చిన లైసెన్సులను క్యాన్సల్ చేసింది. అదేవిధంగా శుభకార్యాలు, మత సంబంధిత కార్యక్రమాలు, పెండ్లి వేడుకలు, మరే ఇతర వేడుకల్లోనైనా బహిరంగంగా ఆయుధాలను ప్రదర్శించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. గతేడాది ప్రముఖ పంజాబీ సింగర్ సిద్ధూ మూసావాలా ను కొందరు వ్యక్తులు నడిరోడ్డుపై తుపాకులతో కాల్చి చంపిన సంగతి తెలిసిందే.

రాహుల్‌ను దేశం నుంచి వెళ్లగొట్టాలి : ప్రగ్యా

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీని భారతదేశం నుంచి బయటకు వెళ్లగొట్టాలని బిజెపి ఎంపీ ప్రగ్యా ఠాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత ప్రజాస్వామ్యంపై విమర్శలు చేసిన ఆయనకు రాజకీయాల్లో చోటు ఇవ్వరాదని, విదేశీ మహిళకు జన్మించిన ఆయనకు దేశభక్తి లేదని పగ్యా ఠాకూర్ విమర్శించింది. బ్రిటన్ పర్యటనలో రాహుల్‌గాంధీ మోడీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌లో మునపటి ప్రజాస్వామ్యం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఒక రహస్య సంస్థగా మారిందని, రాజ్యాంగ వ్యవస్థల్ని కబలిస్తోందని ఆయన ఆరోపించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాల గొంతును అణగదొక్కుతోందన్న సంగతి తెలిసిందే.

భారత్‌లో స్వేచ్ఛ పాక్షికమే..!

- 2022లోనూ అదే స్థితి
- యుఎస్ సంస్థ 'ఫ్రీడమ్ హౌజ్' నివేదిక
- మోడీ పాలనలో దేశ పరిస్థితులపై ఆందోళన



న్యూఢిల్లీ : మోడీ పాలనలో భారత్‌లో స్వేచ్ఛ అనే పదానికి స్థానం కనిపించడం లేదు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛ అనేది అందని ద్రాక్షగా మారింది. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు ఈ విషయాన్ని అనేక సార్లు వెల్లడించాయి. అమెరికాకు చెందిన ఫ్రీడమ్ హౌజ్ కూడా ఇప్పుడు ఇదే విషయాన్ని వెల్లడించింది. భారత్‌లో 2022లోనూ 'పాక్షిక స్వేచ్ఛ' స్థితి ఉన్నదని వివరించింది. కిందటేడాదితో పోల్చుకుంటే మొత్తం స్కోర్లలో ఎలాంటి మార్పూ లేదని స్పష్టం చేసింది. 'ప్రపంచంలో స్వేచ్ఛ (ఫ్రీడమ్ ఇన్ ద వరల్డ్)' పేరిట 2023 ఏడాదికి సంబంధించిన ఎడిషన్‌ను సదరు సంస్థ విడుదల చేసింది.

కొన్ని అంశాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా 195 దేశాలకు ఈ నివేదికలో ర్యాంకులు కేటాయించారు. కాగా, భారత్ వంద మార్కులకు గానూ 66 మార్కులను సాధించింది. ఎన్నికల ప్రక్రియ, రాజకీయ బహుళత్వం మరియు భాగస్వామ్యం, ప్రభుత్వ పనితీరు, భావప్రకటనా స్వేచ్ఛ మరియు నమ్మకం, సంఘ మరియు సంస్థాగత హక్కులు, చట్ట పాలన, వ్యక్తిగత స్వయంప్రతిపత్తి మరియు హక్కులు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి.

ముస్లింల రాజకీయ హక్కులకు ముప్పు

భారత్‌లో ముస్లింల రాజకీయ హక్కులకు ముప్పు పొంచి ఉన్నదని నివేదిక పేర్కొన్నది. ఈ విషయంలో మోడీ సర్కారు పట్టుబట్టి మరీ తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) గురించి ఉటంకించింది. జనాభాలోని అట్టడుగు తరగతులు పూర్తి స్థాయి రాజకీయ ప్రాతినిధ్యానికి నోచుకోలేక అడ్డంకులను ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 545 ఎంపీ స్థానాలకు గానూ ముస్లింలు 27 మంది మాత్రమే విజయం సాధించారని పేర్కొన్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 14.2 శాతం ఉన్న ముస్లిం జనాభాకు దక్కిన స్థానాలు ఐదు శాతం మాత్రమేనని వివరించింది. 2022 ముగింపు నాటికి బిజెపి నుంచి ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేకపోవడం గమనార్హం.

నిష్క్రియాత్మకంగా లోకాయుక్త

భారత్‌లో ప్రభుత్వ పని తీరు పైనా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. లోకాయుక్తలు ఉనికిలో ఉన్నప్పటికీ.. వాటి అసమర్థ సంస్థాగతీకరణను పేర్కొన్నది. ఇలాంటి సంస్థలు తమ పనులను నెమ్మదిగా చేస్తున్నాయని వివరించింది. 2022 అక్టోబర్ నాటికి దేశవ్యాప్తంగా 29 రాష్ట్ర స్థాయి లోకాయుక్తలలో ఏడింటి వార్షిక నివేదికలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండటం గమనార్హం. ఇక ఆర్టీఐ కింద ప్రభుత్వ పని తీరుకు సంబంధించి దాఖలు చేసిన పలు దరఖాస్తులకు సమాధానాలు లభించడం లేదు. ఇందుకు ఆర్టీఐ అధికారుల పైనా చర్యలు ఉండటం లేదు. ఆర్టీఐ తన ప్రభావాన్ని కోల్పోయిందని వివరించింది.

పత్రికా స్వేచ్ఛపై పెరిగిన దాడులు

భారత్‌లో పత్రికా స్వేచ్ఛ ప్రమాణాలు పడిపోవడంపై ఈ నివేదిక వివరించింది. మోడీ పాలనలో పత్రికా స్వేచ్ఛపై దాడులు క్రమంగా పెరిగాయని పేర్కొన్నది. కీలకమైన మీడియా గొంతు నొక్కేందుకు అధికారిక యంత్రాంగాలు రాజద్రోహం, పరువునష్టం, కోర్టు ధిక్కరణ చర్యలతో పాటు పలు చట్టాలను ఉపయోగించాయని వివరించింది. స్వతంత్ర మీడియా సంస్థలపై సోదాలనూ ఉటంకించింది. ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకులు ముహమ్మద్ జుబేర్ అరెస్టును, గతేడాది ది వైర్‌కు సంబంధించిన నలుగురు ఎడిటర్లు, ఇండ్లలో జరిగిన సోదాలను ఇందులో ఉదహరించింది.

యూనివర్శిటీల్లో హింస.. ప్రొఫెసర్లపై దాడులు

పత్రికా స్వేచ్ఛ మాత్రమే కాదు.. కొన్నేండ్లుగా భారత్‌లో విద్యా స్వేచ్ఛ గణనీయంగా బలహీనబడిందని నివేదిక పేర్కొన్నది. యూనివర్సిటీ క్యాంపస్‌లలో హింస, ప్రొఫెసర్లపై దాడులు పెరిగాయని వివరించింది. 'బిజెపి సర్కారు సున్నితమైన అంశాలుగా భావించే వాటిపై చర్చించొద్దనే ఒత్తిడిని విద్యావేత్తలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, పాకిస్థాన్‌తో భారత సంబంధాలు, భారత కాశ్మీర్‌లో పరిస్థితులకు సంబంధించి ఇందులో ఉన్నాయి' అని నివేదిక పేర్కొన్నది. కర్నాటకలో తీవ్ర చర్చకు దారి తీసిన హిజాబ్ అంశాన్ని కూడా లేవనెత్తింది.

ఎన్జీఓల లైసెన్సుల రద్దుపై ఆందోళన

2017 నుంచి 2021 మధ్య దేశంలో 6,677 ఎన్జీఓల విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్ఎ) లైసెన్సుల రద్దుపై నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే, 2022లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ నేతృత్వంలోని రెండు ఎన్జీఓలపై జరిపిన ఇలాంటి చర్యనూ ఉటంకించింది. మహ్మద్ ప్రవక్తపై బిజెపి మాజీ అధికార ప్రతినిధి నుపూర్ శర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో చోటు చేసుకున్న హింసాత్మక నిరసనలు, ఢిల్లీ, గుజరాత్, యూపీ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అక్కడి బిజెపి ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగాలు ముస్లింల భవనాలను కూల్చివేసిన ఘటనల గురించి నివేదిక వివరించింది.

స్వలింగ వివాహాలు అసహజం

- అంగీకారయోగ్యం కాదు
- కేంద్రం అఫిడవిట్
- పిటిషన్లను కొట్టివేయాలని వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్వలింగ వ్యక్తుల మధ్య వివాహాలు (సేమ్ సెక్స్ మ్యారేజ్) అసహజమైనవని, చరిత్రలో ఇలాంటి వివాహాల గురించి లేదని, తాము అంగీకరించబోమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించింది. స్వలింగ వివాహాలకు గుర్తింపు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని విన్నవించింది. భారతదేశ కుటుంబ వ్యవస్థకు ఇది విరుద్ధమని కూడా కేంద్రం తన అఫిడవిట్‌లో పేర్కొంది. భారత శిక్షా స్మృతి(ఐపిసి)లోని సెక్షన్ 377ను డిక్రిమినలైజ్ చేసినంత మాత్రాన..దాని ఆధారంగా స్వలింగ వివాహాలకు గుర్తింపు ఇవ్వాలని కోరడం సమంజసం కాదని తెలిపింది. సహజంగా స్త్రీ - పురుషుల మధ్య జరిగే వివాహాలకే దేశంలో గుర్తింపు ఉంటుందని, చరిత్ర మొత్తం చూసినా ఇదే ప్రమాణం కనిపిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. రాజ్యం మనుగడకు ఇది పునాది అని తెలిపింది.

సేమ్ సెక్స్ మ్యారేజెస్‌కు చట్టపరమైన గుర్తింపు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై స్పందిస్తూ కేంద్రం ఈ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. విజాతీయుల (స్త్రీ - పురుషులు) మధ్య పెళ్లికి ఉన్న సామాజిక విలువలను పరిగణనలోకి తీసుకుని, విజాతీయుల మధ్య జరిగే వివాహాలకు మాత్రమే గుర్తింపునివ్వడం రాజ్యానికి తప్పనిసరి అని కేంద్రం పేర్కొంది. సమాజంలోని వ్యక్తుల మధ్య సంబంధాల విషయంలో వ్యక్తిగత అవగాహనలు రకరకాలుగా ఉండవచ్చునని, పెళ్లిళ్లు, కలయికలు వంటివి వేర్వేరు రూపాల్లో ఉండవచ్చునని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో హెటిరో సెక్సువల్ (స్త్రీ, పురుషుల మధ్య) వివాహానికి మాత్రమే గుర్తింపును పరిమితం చేయాలని కోరింది. పెళ్లిళ్లు, కలయికలు వంటివి వేర్వేరు రూపాల్లో ఉన్నవాటికి గుర్తింపు ఇవ్వకపోయినప్పటికీ చట్టవ్యతిరేకం కాదని తెలిపింది. సమాజంలో కుటుంబ వ్యవస్థ ఉందని, దీనిలో చిన్న చిన్న కుటుంబాలు ఉన్నాయని, సమాజం అనే భవన నిర్మాణానికి ఇవి ఇటుకల వంటివని తెలిపింది. కుటుంబాలు కొనసాగాలని తెలిపింది.

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరపబోతోంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరుపుతుందని సుప్రీంకోర్టు కాజ్ లిస్ట్ వెల్లడించింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దీవాలా కూడా ఉన్నారు. స్త్రీని మరొక స్త్రీ పెళ్లి చేసుకున్నపుడు, పురుషుడు మరొక పురుషుడిని వివాహం చేసుకున్నపుడు ఆ వివాహానికి లీగల్ వ్యాలిడిటీ (చట్టపరమైన చెల్లుబాటు) కల్పించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టు సహా వివిధ హైకోర్టులలో దాఖలైన పిటిషన్లను కలిపి, సుప్రీంకోర్టు జనవరి 6న తనకు బదిలీ చేసుకుంది. ఇష్టపూర్వక గే సెక్స్ నేరం కాదని 2018లో తీర్పు చెప్పిన రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ డివై చంద్రచూడ్ కూడా ఉన్నారు. ఐపిసి సెక్షన్ 377 హేతుబద్ధమైనది కాదని, సమర్థనీయం కాదని, నిరంకుశమైనదని ఈ తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది.

నాన్న వస్తున్నాడంటే భయమేసేది

- లైంగికంగా వేధించేవాడు
- ఢిల్లీ మహిళా చీఫ్ స్వాతి మలివాల్ వెల్లడి

న్యూఢిల్లీ : ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. చిన్నతనంలో తన తండ్రి తనను లైంగికంగా వేధించాడని అన్నారు. తనను చిన్నతనంలో తన నాన్న లైంగికంగా వేధించేవాడని, ఆయన ఇంటికి వస్తున్నాడంటేనే భయపడిపోయేదాన్నని, మంచం కింద దాక్కునే దాన్నని పేర్కొన్నారు. దీంతో ప్రతిరాత్రి ఆడవారికి ఎలా సహాయం చేయాలని, పిల్లలను వేధించే పురుషులకు ఎలా గుణపాఠం చెప్పాలని ప్రతి రాత్రి ప్లాన్ చేసేదాన్నని అన్నారు. తాను నాలుగవ తరగతి చదివే వరకు తన తండ్రితో కలిసి జీవించానని, ఈ విధంగా చాలాసార్లు జరిగిందని అన్నారు. తన పోనీటెయిల్‌ను పట్టుకుని గోడకేసి కొట్టేవాడని, తల నుండి రక్తం కారిందని అన్నారు. ఒక వ్యక్తి చాలా వేధింపులకు గురైనపుడు, అతను ఇతరుల బాధను అర్థం చేసుకుంటాడని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. అది మొత్తం వ్యవస్థను కదిలించే అగ్నిని మేల్కొలుపుతోందని అన్నారు. తాను ఎనిమిదేళ్ల వయసులో లైంగిక వేధింపులకు గురైనట్లు చెప్పారు. "భార్యాపిల్లల్ని చిత్రహింసలు పెట్టడం, కన్న కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడడాన్ని జన్మహక్కుగా భావించే వ్యక్తి వల్ల నా తల్లి వైవాహిక బంధంలో ఇబ్బందులు పడింది. ఎనిమిదేళ్ల వయసులోనే నేను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని నటి, బిజెపి నేత ఖుష్బూ సుందర్ పేర్కొన్నారు.


కోవిడ్ దర్యాప్తునకు కట్టుబడి ఉన్నాం

- డబ్ల్యూ హెచ్ఓ పునరుద్ఘాటన

జెనీవా : కోవిడ్-19 వైరస్ ఎలా ఉద్భవించిందో కనుగొనడంపై దర్యాప్తునకు కట్టుబడి ఉన్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పునరుద్ఘాటించింది. వైరస్ మూలాలను కనుగొనడం నైతిక ఆవశ్యకత అని, అన్ని వైపులను నుంచి పరిశోధన ముఖ్యమని మరోసారి డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసింది. చైనా లేబొరేటరీ అనాలోచిత లీక్ వల్ల వైరస్ ఉద్భవించినట్లు అంచనా వేస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రచురించినట్లు అమెరికా మీడియాలో కథనాలు రావడంతో డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ ఈ విషయాన్ని ప్రకటించారు. కరోనా వైరస్ ఆవిర్భావంపై దర్యాప్తు కోసం డబ్ల్యూహెచ్ఓ నేతృత్వంలోని బృందం 2021లో చైనాలోని వుహాన్ పరిసర ప్రాంతాల్లో కొన్ని వారాలు గడిపిన సంగతి తెలిసిందే. తదుపరి పరిశోధన అవసరమని నివేదిక ఇచ్చింది. ఈ తరువాత డబ్ల్యూహెచ్ఓ ఒక శాస్త్రీయ సలహా బృందాన్ని ఏర్పాటు చేసింది. కానీ వైరస్ పుట్టుకపై ఇంకా ఎటు వంటి నిర్ధారణలకు రాలేదు.

ఎలుకల్లోనూ కరోనా వైరస్

- అమెరికన్ సొసైటీ ఫర్ మైక్రోబయాలజీ జర్నల్‌లో వెల్లడి..



న్యూయార్క్ : ఎలుకల్లో కరోనా వైరస్ సంక్రమించవచ్చని అధ్యయనం వెల్లడించింది. న్యూయార్క్ సిటీ ఎలుకలకు కరోనా వైరస్ సంక్రమించవచ్చని అధ్యయనం కనుగొంది. న్యూయార్క్ నగరంలో మొత్తం 8 మిలియన్ల ఎలుకలు ఉన్నాయి. ఇవి ప్రజలతో కాంటాక్ట్ అయ్యే అవకాశం పుష్కలంగా ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. న్యూయార్క్ ఎలుకలు సార్స్ కోవ్-2 యొక్క ఆల్ఫా, డెల్టా, ఓమిక్రాన్ వేరియంట్లకు పాజిటివ్ గా పరీక్షించబడ్డాయి. మొత్తం 79 ఎలుకల్లో 16.5 శాతం ఎలుకలకు కరోనా సోకినట్లు పరిశోధకులు గుర్తించారు. ఎలుకలకు కరోనా సోకుతుందని నిరూపించిన తొలి ప్రయోగం ఇదే అని అన్నారు. అమెరికన్ సొసైటీ ఫర్ మైక్రోబయాలజీ యొక్క ఓపెన్-యాక్సెస్ జర్నల్ ఎంబియోలో ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అయితే, కోవిడ్ సోకిన ఎలుకలకు ఎలా కరోనా సోకింది..? ఇది మానవులకు ప్రమాదాన్ని తీసుకువస్తుందా..? అనేది స్పష్టంగా తెలియలేదు. ఈ వైరస్ ఎలుకల్లో కొత్త వేరియంట్ల పరిణామం చెందుతుందో లేదో తెలుసుకోవడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని డాక్టర్ హెన్రీ వాన్ చెప్పారు. మానవులను ప్రభావితం చేసే మహమ్మారిలో జంతువుల ప్రముఖ పాత్రను పోషిస్తాయని ఈ ప్రయోగం ద్వారా వెల్లడైందని అధ్యయన వేత్తలు చెప్పారు. అయితే గబ్బిలాల వంటి క్షీరదాల వల్ల ప్రజలకు వైరస్ వ్యాప్తి చెందుతుందని కొన్ని నివేదికలు తెలుపుతున్నాయి. అయితే ఇది అత్యంత అరుదుగా మాత్రమే జరుగుతుందని యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) తెలిపింది. దీనికి ముందు హాంకాంగ్, బెల్జియంలో ఎలుకలపై చేసిన అధ్యయనాల్లో అవి వైరస్ ఇన్ఫెక్షన్లకు గురైనట్లు కనుగొన్నారు. పిల్లులు, కుక్కలు, గొరిల్లాలు, హిప్పోలు, జింకలు, యాంట్‌ఈటర్స్‌లో కరోనా వైరస్ సోకినట్లు నివేదికలు గుర్తించాయి.

మహారాష్ట్రలో మత చిచ్చు

- ముస్లింలు లక్ష్యంగా విద్వేష ప్రసంగాలు
- ముంబయి, థానె..సహా వివిధ నగరాల్లో లవ్ జిహాద్ ర్యాలీలు

న్యూఢిల్లీ : బిజెపి-శివసేన సర్కార్ అండదండలతో ఇటీవల మహారాష్ట్రలో హిందూత్వ శక్తులు పెట్రేగిపోతున్నాయి. ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నాయి. ఆ వర్గం వారిపై హింసకు దిగాలంటూ హిందువుల్ని రెచ్చగొడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ నగరాల్లో 'లవ్ జిహాద్ ర్యాలీ'ల పేరుతో హిందూత్వ గ్రూపులు చేపడుతున్న ప్రదర్శనలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. 'సకల్ హిందూ సమాజ్' అనే సంస్థ 'లవ్ జిహాద్ ర్యాలీ'లను చేపడుతోంది. కొద్ది రోజుల క్రితం థానె పట్టణానికి సమీపంలో నెవాలీ వద్ద నిర్వహించిన ర్యాలీకు కాషాయ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యకర్తలను ఉద్దేశించి పలువురు వక్తలు ప్రసంగిస్తూ, ముస్లింలపై విద్వేషం వెళ్లగక్కారు. గత కొద్ది నెలలుగా నెవాలీ, లాతూర్, పర్భానీ, జల్గావ్, అహ్మద్‌నగర్, ముంబయి, బారామతి, నందుర్బార్ నగరాల్లో చేపట్టిన ర్యాలీల్లో విద్వేష ప్రసంగాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

దీనిపై పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ ప్రధాన కార్యదర్శి లారా జెసానీ మాట్లాడుతూ, "ముంబయిలో ఈ తరహా విద్వేష ప్రసంగాలు, ర్యాలీలు ఎప్పుడూ చూడలేదు. ఒక వర్గం వారిని టార్గెట్ చేస్తూ 'లవ్ జిహాద్' ర్యాలీలు ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒక వర్గం వారిపై హింసకు దిగాలని బహిరంగంగా పిలుపు ఇస్తున్నారు" అని ఆందోళన వ్యక్త చేశారు. పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా విద్వేష ప్రసంగాలు ఆగటం లేదని లారా జెసానీ చెప్పారు.

సుప్రీం ఆదేశాలు బేఖాతరు

గత ఏడాది నవంబర్ నుంచి రాష్ట్రంలో 'లవ్ జిహాద్ ర్యాలీ'లు సాగుతున్నాయి. ప్రతిచోటా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని విద్వేష ప్రసంగాలు చేయటం పరిపాటిగా మారింది. ముంబయిలో జనవరి 29న సకల్ హిందూ సమాజ్ చేపట్టిన ర్యాలీలో వక్తలు పెద్ద ఎత్తున విద్వేష ప్రసంగాలు చేశారు. ఈ విషయం సుప్రీకోర్టు వరకు చేరింది. ఇలాంటి ర్యాలీలకు ఇకపై అనుమతి ఇవ్వమని మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. తదుపరి ర్యాలీకి సంబంధించిన వీడియో రికార్డులను సమర్పించాలని సుప్రీం ఆదేశించింది. విద్వేష ప్రసంగాలు వెలువడితే పోలీసులు వెంటనే జోక్యం చేసుకోవాలని, వారిని అరెస్టు చేయాలని చెప్పింది. అత్యున్నత న్యాయస్థానం సుప్రీం నుంచి ఆదేశాలు వచ్చినా, 'సకల్ హిందూ సమాజ్' ర్యాలీలు అలాగే కొనసాగుతున్నాయి. కోర్టు ఉత్తర్వులు వెలువడ్డాక 11 ర్యాలీలు చేపట్టింది. వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, సనాతన్ సంస్థ, దుర్గా వాహిని, విశ్వ శ్రీరాం సేన, హిందూ రాష్ట్ర సేన, హిందూ జనజాగృతి సమితి, హిందూ ప్రస్తాన్‌కు చెందిన నాయకులు ర్యాలీల్లో పాల్గొంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు.

అమెరికా అడ్వైజరీ కమిటీలో ఇద్దరు ఇండో-అమెరికన్లు

వాషింగ్టన్ : వాణిజ్య విధానం, పెట్టుబడులు, అభివృద్ధి అంశాలపై అమెరికా ప్రభుత్వం నియమించిన అడ్వైజరీ కమిటీలో ఇద్దరు ఇండో-అమెరికన్ సిఇఓలకు స్థానం లభించింది. ఫ్లెక్స్ సిఇఓ రేవతి అద్వైతి, న్యాచురల్ రిసోర్స్ డిఫెన్స్ కౌన్సిల్ సిఇఓ మనీషా బాప్నాకు కమిటీలో సభ్యులుగా నియమించినట్లు అమెరికా అధ్యక్షులు జో బైడెన్ ప్రకటించారు. మొత్తం 14 మంది సభ్యులతో కమిటీని నియమించారు. అమెరికా వాణిజ్య విధానం అభివృద్ధి, అమలు, నిర్వహణకు సంబంధించి విషయాలపై అమెరికా ప్రభుత్వానికి ఈ కమిటీ తన సలహాలను అందచేస్తుంది. అలాగే ఏదైనా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే ముందే ఒప్పందం అమలయితే దాని ప్రభావం, నిర్వహణకు సంబంధించిన అంశాలపైనా కమిటీ సలహాలు ఇవ్వనుంది.

అదానీ అక్రమాలపై జెపిసి వేయాల్సిందే

- రాజ్యసభ ఛైర్మన్‌కు స్పష్టం చేసిన ప్రతిపక్షాలు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు బడ్జెట్ మలి విడత సమావేశాల సందర్భంగా రాజ్యసభ పక్షనేతలతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఆదివారం సమావేశం నిర్వహించారు. సభ సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ నివేదిక, తదనంతరం రూ.13 లక్షల కోట్ల మదుపర్ల సొమ్ము ఆవిరైపోవడం వంటి పరిణామాలపై ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరుతామని ప్రతిపక్ష నేతలు తెలిపారు. అదానీ అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటి (జెపిసి) విచారణకు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదే విషయాన్ని రాజ్యసభ ఛైర్మన్‌కు కూడా స్పష్టం చేసినట్లు తెలిసిందే. ప్రతిపక్ష నేతలపై ఇటీవల సిబిఐ, ఇడి దాడులు నిర్వహించాయని, వీరిలో కొందరిని వివిధ కేసుల్లో ప్రశ్నించడంతోపాటు అరెస్టు చేయడంపై కూడా ప్రతిపక్షాలు పెద్దఎత్తున ఆందోళనకు దిగే అవకాశం ఉంది. కేంద్రంలోని బిజెపి నేతత్వంలోని ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తున్నాయి. ఎల్ఐసి, ఎస్‌బిఐ రిస్క్ ఎక్స్‌పోజర్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, కేంద్ర సంస్థల దుర్వినియోగం వంటి అంశాలను ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తుతాయి. బిజెపియేతర పాలిత రాష్ట్రాలపై 'రాజకీయ ప్రతీకార' అంశాన్ని, ఉపాధి హామీ వంటి పథకాలకు నిధులను నిలిపివేయడంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయనున్నాయి.

పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ ఆర్థిక బిల్లును ఆమోదించడమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని అన్నారు. రైల్వేలు, పంచాయతీరాజ్, పర్యాటకం, సంస్కృతి, ఆరోగ్య మంత్రిత్వ శాఖల మంజూరు డిమాండ్లపై చర్చలు జరుపుతామని చెప్పారు. ఆర్థిక బిల్లు ఆమోదం పొందిన తరువాత, ప్రతిపక్షాలు లేవనెత్తిన డిమాండ్లను పరిశీలిస్తామని అన్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లో 35 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రాజ్యసభలో 26 బిల్లులు, లోక్‌సభలో 9 బిల్లులు ఆమోదం కోసం ఉన్నాయి.

ఎన్నికలు నిర్వహించాలి

- దీనిపై జాతీయ నాయకులు, ఈసీని కలుస్తాం
- జమ్మూకాశ్మీర్ రాజకీయ పార్టీల వెల్లడి
- మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా నివాసంలో అఖిలపక్ష భేటీ

న్యూఢిల్లీ : కేంద్రపాలిత ప్రాంతం (యుటి) జమ్మూకాశ్మీర్‌లో గత కొన్నేండ్లుగా ఎన్నికల నిర్వహించకపోవడంపై అక్కడి రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయంలో మోడీ సర్కారు తీరును తప్పుబట్టాయి. ఎన్నికల నిర్వహించాలనే డిమాండ్‌తో పాటు ఈ ప్రాంతంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అక్కడి రాజకీయ పార్టీలు చర్చించాయి. ఈ మేరకు కాశ్మీర్‌లోయలోని బంతిండిలో ఉన్న జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధినేత డాక్టర్ ఫరూక్ అబ్దుల్లా ఇంటిలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్, పిడిపి, సిపిఎంతో పాటు పలు ప్రాంతీయ పార్టీలు పాల్గొన్నాయి. తమ ప్రాంతం ఎదుర్కొంటున్న సమస్యలు ఆస్తి పన్ను, విద్యార్థుల నిరసనలు, జమ్మూకాశ్మీర్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితితో పాటు పలు అంశాలపై చర్చించినట్టు పత్రికా సమావేశంలో ఫరూక్ అబ్దుల్లా తెలిపారు.

సాధారణ పరిస్థితులుంటే ఎన్నికలెందుకు జరగవు?

తమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితుల గురించి ఢిల్లీకి వెళ్లి జాతీయ నాయకులకు వివరించాలని తాము నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. 'జమ్మూకాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులే ఉన్నాయనీ, జి20 సమావేశం నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు అంటున్నారు. మరి అలాంటపుడు ఇక్కడ ఎన్నికలు ఎందుకు నిర్వహించలేరు?' అని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. ఎన్నికలు జరపాలనే డిమాండ్‌తో జాతీయ నాయకుల మద్దతుతో తాము ఎన్నికల సంఘాన్ని కలుస్తామని తెలిపారు. 2014 నుంచి ఇక్కడ ఎన్నికలు జరగటం లేదనీ, ఒక ప్రజాస్వామిక దేశంలో ఇది ఒక వింత విషయమని ఆయన అన్నారు. ఢిల్లీలో సమావేశం తర్వాత తామంతా మళ్లీ ఇక్కడే సమావేశమవుతామనీ, రంజాన్ నెల తర్వాత ఇదే అఖిలపక్ష సమావేశం ఉంటుందని ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేశారు. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడం ద్వారా ఎన్నికలు త్వరితగతిన జరుగుతాయని అన్నారు.

ఈ సమావేశానికి సిపిఎం సీనియర్ నాయకులు ఎంవై తరిగామి హాజరయ్యారు. బెదిరించి తమ మధ్య విభజన తీసుకొచ్చే ప్రయత్నాలు జరిగాయని తరిగామి పత్రికా సమావేశంలో అన్నారు. ఆస్తి పన్ను అయినా, మరేదైనా.. అలాంటి నిర్ణయాలు తీసుకొనే అధికారాన్ని అసెంబ్లీకే ఉండాలని చెప్పారు.



స్ఫూర్తిదాయకం.. శ్వేతవర్ణ శోభితం

- ఆకట్టుకున్న ఐద్వా కార్యకర్తల ర్యాలీ

మలప్పురం : కేరళలో మలప్పురంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. 1200 మంది మహిళా వాలంటీర్లు శ్వేత వర్ణ దుస్తులు యూనిఫాంగా ధరించి ఈ ర్యాలీలో పాల్గొనడం విశేషం. ఇంత పెద్ద సంఖ్యలో వివిధ సామాజిక తరగతులకు చెందిన మహిళలు ఐక్యంగా యూనిఫాం ధరించి ర్యాలీ చేయడం ఇదే తొలిసారి. ఐద్వా జిల్లా కార్యాలయాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ప్రారంభించారు. ఐద్వా అధ్యక్షులు పికె శ్రీమతి పతాక ఆవిష్కరణ చేశారు.

టైరు పేలడం 'దైవేచ్ఛ' కాదు

- మానవ నిర్లక్ష్యమే : బాంబే హైకోర్టు స్పష్టీకరణ

ముంబయి : వాహనాల టైరు పేలడం యాక్ట్ ఆఫ్ గాడ్ (దైవేచ్ఛ) కాదని.. అది మానవ నిర్లక్ష్యమేనని బాంబే హైకోర్టు ఇటీవల స్పష్టం చేసింది. బాధిత కుటుంబానికి బీమా సంస్థ పరిహారం అందించాలని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. కారు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం యాక్ట్ ఆఫ్ గాడ్ కిందకే వస్తుందని, పరిహారం చెల్లించలేమంటూ న్యూ ఇండియా అస్యూరెన్స్ చేసిన విజ్ఞప్తిని బాంబే హైకోర్టు తిరస్కరించింది.

ముంబయికి చెందిన పట్వర్ధన్ 2010 అక్టోబర్‌లో ఇద్దరు స్నేహితులతో కలిసి పూణె నుండి ముంబయికి కారులో వెళ్తున్నారు. డ్రైవర్ కారుని వేగంగా నడపడంతో కారు వెనక టైరు పేలడంతో కారు గుంతలో పడింది. ఈ ప్రమాదంలో పట్వర్ధన్ మరణించారు. ఈ కేసును విచారించిన మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ పట్వర్ధన్ కుటుంబానికి రూ.1.25 కోట్ల రూపాయల పరిహారం అందించాలని న్యూ ఇండియా అస్యూరెన్స్ బీమా కంపెనీని 2016లో ఆదేశించింది. అతడి కుటుంబానికి అతనొక్కడే ఆర్థిక ఆధారమని వ్యాఖ్యానించింది. అయితే, ఆ పరిహారం చాలా అధికంగా ఉందని పేర్కొంటూ ట్రిబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ బీమా సంస్థ బాంబే కోర్టులో అప్పీలు చేసింది.

వాహన టైరు పేలడం అనేది విపత్తు కిందకు వస్తుందని బీమా సంస్థ హైకోర్టులో వాదనలు వినిపించింది. ఈ వాదనను జస్టిస్ ఎస్.డి. డిగే ధర్మాసనం బీమా సంస్థ వాదనను నిరాకరించింది. టైరు పేలడం అనేది విపత్తు కిందకు రాదని.. అది నియంత్రించగలిగే చర్యేనని స్పష్టం చేసింది. అతివేగం, టైరులో గాలి హెచ్చు తగ్గులు లేదా సెకండ్ హ్యాండ్ టైర్, ఉష్ణోగ్రత వంటివి టైరు పేలడానికి కారణాలై ఉండవచ్చని పేర్కొంది. ప్రయాణానికి ముందు వాహనం డ్రైవర్ లేదా యజమాని టైర్ పరిస్థితిని తనిఖీ చేసి ఉండాల్సిందని, దీంతో ఇది మానవ తప్పిదం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు పేర్కొంది.




మీకోసం

ధనియాలు నోట్లో వేసుకొని చప్పరిస్తూ ఉంటే నోటి దుర్వాసన తగ్గుతుంది.

జీవన సౌరభం

ఓ మంచి ఆలోచన లక్షలాదిమందిని కదిలిస్తుంది. లక్షలాది మందిలో కదలిక ఒక సమాజాన్ని కదిలిస్తుంది.

అక్షయం అక్షరం



భవితకు ఆయుషు
పోస్తుంది అక్షరం
బ్రతుకుకు తేజస్సు
నిస్తుంది అక్షరం

అజ్ఞాన తిమిరాన్ని
తరుమును అక్షరం
విజ్ఞాన జ్యోతుల్ని
వెలిగించు అక్షరం

బలమైన ఆయుధం
బ్రతుకున అక్షరం
బంగారు భవితకు
ఆధారం అక్షరం


మానవ మనుగడకు
మూలమే అక్షరం
గౌరవ సాధనకు
వంతెనే అక్షరం

ఉన్నత స్థానాన
నిలిపేది అక్షరం

వెన్నుపోటు పొడవనిది
నిజముగా అక్షరం

ఎనలేని కీర్తిని
పెంచేది అక్షరం
మెండుగా స్ఫూర్తిని
నింపేది అక్షరం

- గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు,
99664 14580.



అవి ఏవీ?

చిన్నారులూ, పై వరుసలో ఉన్న ఉడతల్లో ఒకటి, కింది వరుసలో ఉన్న ఉడతల్లో మరొకటి ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏంటో కనిపెట్టండి.

జవాబు: 2-8

నేను గీసిన బొమ్మ




- జి. ప్రణీత,
యుకెజి,
శ్రీ ఆదిత్య విద్యా నిలయం స్కూలు,
కల్లూరు, కర్నూలు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆనాటి చేదు జ్ఞాపకాల ధార ...

పొత్తిళ్లబిడ్డ పురిటిమంచంపై పాలకు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. అయినా ఆ తల్లి రావడం లేదు.. ఎందుకు? బిడ్డ ఏడుపు వినపడడం లేదా.. లేక ఆ దరిదాపుల్లో లేదా.. అంత చిన్న బిడ్డను వదిలి ఎందుకు వెళ్లింది. ఎక్కడికి వెళ్లింది.. ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తున్న వేళే.. ఇంకోచోట.. ఆ పొత్తిళ్ల బిడ్డ తల్లి ఒడిలో ఓ బిడ్డ చనుబాలు జుర్రుకుంటున్నాడు. బిడ్డను ఒడిసిపట్టుకున్న తల్లి కంటి నుండి పాలవలె కన్నీరు ఉబికిఉబికి వస్తున్నాయి. ఈ దృశ్యాలు కథల్లోనో.. సినిమాల్లోనో చూసినవి కాదు.. ఒక తరం మహిళలు అనుభవించిన కన్నీటి వెతలు.
ఆ రోజులు గడిచిపోయినా గతం తాలూకూ చేదు జ్ఞాపకాలు గుర్తుతెచ్చుకున్న ప్రతిసారీ ఆ మహిళల గుండెలు బరువెక్కుతాయి..



డెబ్బై ఐదేళ్ల ఎల్లమ్మ దళిత మహిళ. వ్యవసాయ కూలీగా పనిచేసేది. పొలంలో ఎంతో శ్రమ చేసే శ్రామిక రైతు మహిళల్లో ఆమె ఒకరు. అయితే ఎల్లమ్మ జీవితం వేరు. తను చూసిన మహిళలు వేరు. వారంతా పొలంలో పనిచేసినా మరో అదనపు పని కోసం పరుగులు తీయడం తను చూసింది. ఆమె ఇలా చెబుతోంది : డోర్నకల్ ప్రాంతంలో మా గూడెంలో అక్కమ్మ అనే మహిళ ఉండేది. 1960 ప్రాంతంలో తన ఇరవై ఏళ్ల వయసులో మొదటిబిడ్డను ప్రసవించింది. బిడ్డ పుట్టిన ఐదు నెలల తరువాత ఆ ఊళ్లోని దొర ఇంటి నుండి అక్కమ్మకు పిలుపు వచ్చింది. దొర భార్య కూడా అక్కమ్మ వయసుదే.. బిడ్డను కని పిల్లవాడికి పాలు ఇవ్వలేని స్థితిలో ఉంది. దీంతో ఆ బిడ్డ ఆకలి తీర్చేందుకు అక్కమ్మను పిలుచుకెళ్లారు. అప్పటి నుండి ఆమె తన బిడ్డ కంటే ఎక్కువ సార్లు దొరబిడ్డకు పాలిచ్చేందుకు ఆ ఇంటికెళ్లేది. గంటలు గంటలు అక్కడే ఉండేది. తన బిడ్డ ఆకలితో ఉన్నా తప్పేది కాదు.”

దొరల జమానాలో దళిత మహిళలు ఎన్నో దుర్భర పరిస్థితులు అనుభవించారని ఎల్లమ్మ చెబుతున్నంత సేపూ ఆమె కంఠం వణుకుతూనే ఉంది. ‘దొరల ఏలుబడిలో మావారంతా బానిస బతుకుల కంటే దుర్భరంగా జీవించారు. మా ఇంటి యజమానులు ఇంటి వెలుపల ఉండి మాట్లాడితే మాకు మాత్రం ఇంటిలోపలికి, మంచం మీదికి కూడా స్థానముండేది. ఎన్నో పనులు మాతో చేయించేవారు. బలవంతం చేసో.. భయపెట్టో.. లొంగకపోతే చంపడానికైనా సిద్ధపడేవారు. వారి దృష్టిలో మా శరీరాలు గొప్ప వనరు. అందుకే మా పాలను వారి పిల్లల ఎదుగుదలకు ఉపయోగించుకునేవారు. ఒప్పుకోని వారిని శారీరకంగా, మానసికంగా, లైంగికంగా వేధించేవారు. ఆ వేధింపులు కుటుంబాలను కూడా కబళించేసేవి. నా అనుభవంలో అటువంటి వారిని ఎంతోమందిని చూశాను.



పాలిచ్చే తల్లులను ఎంచుకోవడంలో కూడా దొర కుటుంబం ఓ ప్రత్యేకతను పాటించేది. యుక్తవయసు తల్లులనే పాలిచ్చేందుకు తీసుకెళ్లేవారు. ఒకే సమయంలో ఇద్దరు బిడ్డలకు పాలివ్వాలంటే ఇద్దరు బిడ్డల ఆకలి తీర్చే పాలు ఉత్పత్తి అవ్వాలి. అలా జరగనప్పుడు ఒక బిడ్డ ఆకలితో అలమటించాల్సిందే... అలా మా వాడ నుండి దొర జమానాకు వెళ్లిన తల్లి కన్న బిడ్డ ఆకలితో గుక్కపట్టి ఏడ్వడం నాకు ఇప్పటికీ గుర్తే” అని వివరించింది ఎల్లమ్మ.

‘మా గూడెంలో ఇలా ఇతర తల్లుల బిడ్డలకు పాలివ్వడం మామూలేనని మా అమ్మమ్మ చాలాసార్లు నాకు చెప్పింది. అయితే వారంతా స్వచ్ఛందంగా పాలిచ్చేవారు. ఆ రోజుల్లో చిన్న వయసులోనే పెళ్లి, పిల్లలు పుట్టడంతో మాతా, శిశు మరణాలు ఎక్కువగా ఉండేవి. దీంతో తల్లి మరణించిన పురిటిబిడ్డకు మా గూడెం మహిళలు తమ బిడ్డలతో సమానంగా పాలిచ్చేవార’ని తన అమ్మమ్మ చెప్పిన జ్ఞాపకాన్ని ఎల్లమ్మ గుర్తుచేసుకుంటూ ‘కానీ అక్కమ్మ పరిస్థితి అలా కాదు. తాను బలవంతంగా దొర ఇంటికి వెళ్లవలసి వచ్చింది’ అంటున్నప్పుడు ఆమె కళ్లల్లో నీటిపొరలు కనిపించాయి.

వెండి వలె తెల్లగా మెరిసిపోతున్న జుట్టుతో కర్రపోటుతో నడుస్తున్న నర్సమ్మ తన అనుభవాన్ని ఇలా చెబుతోంది : ‘సామాజికంగా మేము ఎంతో వివక్షను ఎదుర్కొనేవాళ్లం. కాని వాళ్ల బిడ్డలకు పాలిచ్చేటప్పుడు వారి అవసరాలు తీర్చేందుకు ఈ అంటరానితనం కనిపించేది కాదు. అవసరం అలాంటిది మరి!’

‘నేను దొర పొలంలో పనిచేసేదాన్ని. పశువుల కొట్టం కూడా శుభ్రం చేసేదాన్ని. ఇరవై ఏళ్ల వయసులో దొర బిడ్డకు పాలిచ్చాను కూడా. ఆ బిడ్డకు పాలిచ్చేందుకు వెళ్లే కొన్ని గంటల ముందు వరకు నా సొంత బిడ్డకు పాలివ్వకుండా నాపై ఆంక్షలు ఉండేవి. ఎక్కువ పాలు ఇవ్వాలని, దొర బిడ్డ పాలు తాగే ముందు అంటరాని వాడి బిడ్డ పాలు తాగకూడదని చాలా నీచంగా మాట్లాడేవారు. అందుకే నా బిడ్డ ఆకలితో ఏడుస్తున్నా.. పాలు పొంగి వస్తున్నా దొర బిడ్డ ఆకలి తీర్చేందుకు పరుగులు పెట్టేదాన్ని.. ఆ క్షణంలో ఎంత నరకం అనుభవించానో నాకు మాత్రమే తెలుసు’

ఆ రోజు గుర్తుచేసుకుంటున్నప్పుడు కూడా ఆమె కళ్లు కన్నీటిధారలయ్యాయి.



‘దొర జమానాకు చేరుకునేసరికి నాకు ఓ సబ్బు ముక్క అందించేవారు. అది తీసుకుని పశువుల కొట్టంలో స్నానం చేయమనేవారు. ఎంత అమానవీయం. నా బిడ్డను ఆకలితో ఉంచి వారి బిడ్డకు పాలివ్వడానికి వెళ్లిన నన్ను చాలా నీచంగా చూసేవారు. అది వాళ్ల జన్మ హక్కని భావించేవారు’ అంటున్న నర్సమ్మ తన మాటలు ఎవరైనా వింటున్నారేమోనని చుట్టూ చూస్తున్నప్పుడు ఆమె కళ్లల్లో ఎక్కడో ఏదో మూల ఒకింత భయం కనిపించింది.

‘అమ్మ గంటలు గంటలు దొర ఇంట్లోనే గడిపేది. తమ్ముడు పాల కోసం బాగా ఏడ్చేవాడు. చాలాసార్లు అలా ఏడ్చాడు. తమ్ముడు తరువాత చెల్లి పుట్టింది. అప్పుడు కూడా ఇదే పరిస్థితి. ఆరేళ్ల వయసులోనే తమ్ముడి, చెల్లెళ్ల బాధ్యత నాపై పడింది’ అంటూ 1970ల నాటి తన అనుభవాన్ని గుర్తుచేసుకుంది శిరీష. ఆ రోజుల్లో మా గూడెంలో నా వయసు ఆడపిల్లలందరూ వారి తోబుట్టువుల సంరక్షణలోనే గడిపేవారు. మేము గొడ్డు మాంసం తింటామని మమ్మల్ని అంటరానివారిగా చూసేవారు. కానీ ఆ మాంసం తిన్న మా పాలు మాత్రం చాలా పోషకాలు గలవని నమ్మడం నాకు ఇప్పటికీ అర్థం కాని విషయం’ అంటుంది శిరీష.

ఇటువంటి ఎన్నో కన్నీటి వెతలు ఆనాటి పితృస్వామ్య సమాజానికి నిదర్శనాలు. భారతీయ సమాజంలో మహిళల పట్ల చూపించే వివక్షలో కులం కీలక భూమిక పోషించడం శతాబ్దాల చరిత్ర. 21వ శతాబ్దంలో కూడా అదే పరిస్థితి. అందరు తాగే నీళ్లు తాగాడని స్కూలు పిల్లవాడిని చావబాదిన మాస్టార్లు.. తక్కువ జాతి వాడని నోరు తెరవడని అతనికి ఉన్న కాస్త భూమి లాక్కోవడం, నిమ్న కులం స్త్రీ పంచాయతి ప్రెసిడెంటైనా అధికారుల ముందు కిందే కూర్చోవడం, దాడులు, హత్యలు, అత్యాచారాలు ఇలా ఒకటా రెండా ఎన్నో నేరాల్లో బాధితుల్లో ఎక్కువశాతం మంది షెడ్యూల్ వర్గ ప్రజలు, మహిళలే ఉంటున్నారు. ఈ వివక్ష పోవాలంటే మనుషులు మారాలి. ఆ రోజులు రావాలి.

(అల్‌జజీరా వెబ్‌సైట్ సౌజన్యంతో ..)

ఆస్కార్ వేదికపై మనవాళ్లు ...

ప్రపంచస్థాయిలో ప్రతీ యేటా చలనచిత్ర రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన దర్శకులకు, నటీనటులకు, రచయితలకు, ఇతర సాంకేతిక నిపుణులకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక అవార్డు ఆస్కార్. ఈ బహుమతి ప్రదానోత్సవం అత్యంత వైభోగంగా జరుపడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది వీక్షిస్తారు. అందుకే దీనికి అంత క్రేజ్ ఉంటుంది. మొట్ట మొదటి అకాడమీ అవార్డుల ప్రధానోత్సవం మే 16, 1929లో హాలీవుడ్ స్థాయిలో అమెరికాలో జరిగింది. అప్పటి నుంచీ సినీ పరిశ్రమలో ఉన్న ప్రతిఒక్కరూ ఈ అవార్డు అందుకోవాలని కలలు కంటుంటారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ అవార్డుల వేడుకలో అధికశాతం హాలీవుడ్ సినిమాలు, నటీనటులకే దక్కుతుంటాయి. ఈ నేపథ్యంలో హాలీవుడ్ స్థాయిలో పోటీగా ప్రపంచదేశాల నుంచీ సినిమాలు బరిలో నిలబడుతున్నాయి. అందులోనూ భారతీయ సినిమాలు నిలబడటం చాలా తక్కువ. అయినా మన ప్రయత్నం మాత్రం ఎక్కడా అపలేదు.

మార్చి 12న లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న 95వ ఆస్కార్ వేడుకల సందర్భంగా గతంలో ఆస్కార్ అవార్డు దక్కించుకున్న భారతీయుల గురించి తెలుసుకుందాం.





1982లో విడుదలైన ‘గాంధీ’ సినిమాకి గానూ ‘బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్’గా భాను ఆస్కార్ గెలుపొందారు. ఈ చిత్రం జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ఆధారంగా తెరకెక్కింది. మహారాష్ట్రలో కొల్హాపూర్‌లో జన్మించిన భాను అసలు పేరు. భానుమతి అన్నాసాహెబ్ రాజోపాధ్యాయ్. 1983లో మొదటిసారి ఇండియాకి ఆస్కార్ పురస్కారాన్ని అందుకున్న మహిళగా భాను అథైయా పరిశ్రమలో గుర్తింపు పొందారు. ఈమె గాంధీతో పాటు లగాన్, లేకిన్, స్వదేశ్, 1942 ఏ లవ్ స్టోరీ.. లాంటి పెద్ద పెద్ద సినిమాలకు వర్క్ చేశారు.

భారత చలనచిత్రంలో ఫిల్మిం మేకర్స్‌కు సత్యజిత్ రే ఓ రోల్ మోడల్. పథేర్ పాంచాలి, అపరాజితో, పరశ్ పాథర్, దేవి, అపూర్ సన్‌సార్ ఇలా 36 చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. సినిమాకు సంబంధించిన ప్రతి విభాగంలోనూ ఆయన నిష్ణాతుడు. సినీ రంగానికి సత్యజిత్ రే చేసిన విశేష సేవలను గుర్తించిన అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ 1992లో ఆయనకు ఆస్కార్ పురస్కారాన్ని ప్రకటించింది. పదేళ్ల తర్వాత ఈ అవార్డు పొందిన ఏకైక భారతీయుడు ఆయనే. అదే సంవత్సరంలో ఆయన అనారోగ్యంతో కన్నుమూశారు. 17 ఏళ్ల తర్వాత 2009లో జరిగిన 81వ ఆస్కార్ వేడుకలో ఏకంగా మూడు ఆస్కార్ అవార్డులు ముగ్గురు భారతీయులకు దక్కాయి. ‘స్లమ్‌డాగ్ మిలీనియర్’ చిత్రానికి బెస్ట్ సౌండింగ్ మిక్సింగ్ కేటగిరీలో రసూల్.. రిచర్డ్ ప్రైక్, ఇయాన్ ట్యాప్‌తో కలిసి ఆస్కార్ పురస్కారం స్వీకరించారు. ముసాఫిర్ (హిందీ) సినిమాతో సినీ జీవితాన్ని ప్రారంభించిన రసూల్ తమిళ్, మలయాళం, కన్నడ, తెలుగు (పుష్ప, రాధేశ్యామ్) చిత్రాలకు సౌండ్ మిక్సింగ్ చేశారు. స్లమ్‌డాగ్ మిలీనియర్ సినిమాలోని జయహో.. పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఎంపికైంది. ఈ పాటను రచించిన గుల్జార్ కు ఆస్కార్ దక్కింది. సంగీత ప్రియులకు పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు ఎ. ఆర్. రెహమాన్. రెండు అకాడమీ అవార్డులు గెలుచుకున్న తొలి భారతీయుడిగా ఆయన రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. స్లమ్‌డాగ్ మిలియనీర్ చిత్రానికిగానూ బెస్ట్ ఒరిజినల్ సాంగ్ (జయహో), బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో ఆయన ఆస్కార్ అందుకున్నారు. 2011లో ‘127 అవర్స్’ చిత్రానికి గానూ రెహమాన్ బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ స్కోర్ కేటగిరిలలో నామినేట్ అయ్యారు. ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిలిం విభాగంలో గునీత్ మోంగా నిర్మించిన ‘పీరియడ్.. ఎండ్ ఆఫ్ ఏ సెంటెన్స్’ 2019లో ఆస్కార్ గెలుపొందింది.

ఈ ఏడాది ‘నాటు నాటు’

ఈ సంవత్సరం 2023లో 95వ ఆస్కార్‌కి ఇండియా నుండి బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో నాటు నాటు సాంగ్(ఆర్‌ఆర్‌ఆర్) ఎంపికైంది. ఈ పాటతో పాటూ మరో నాలుగు పాటలు (అప్లాజ్ (టెల్ ఇట్ లైక్ ఎ ఉమెన్), హోల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్: మార్వెరిక్), లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్), ది ఈజ్ ఏ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)) సినిమాలవి నామినేట్ అయ్యాయి. వీటిని దాటుకుని ‘నాటు నాటు’ సాంగ్‌కు ఆస్కార్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్నారు. సంగీత దర్శకుడిగా కీరవాణి, లిరిక్స్ అందించిన చంద్రబోస్ పేర్లను ప్రచురించింది అకాడమీ టీమ్. నాటు నాటు పాటను గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాళ భైరవ పాడారు. ఏడాది క్రితం విడుదలైన పాన్‌ఇండియా చిత్రం ఆర్‌ఆర్‌ఆర్‌లో ఈ పాటకు దేశ దేశాల్లోనూ మంచి క్రేజ్ సంపాదించింది. యాక్షన్ ఎపిక్ మూవీ ఇండియన్ ఆడియన్స్ తో పాటు జపాన్ ఆడియన్స్ ని కూడా అట్రాక్ట్ చేసింది. ఎప్పుడూ లేనిది ఒక ఇండియన్ సినిమా వెస్ట్రన్ ప్రేక్షకులనూ ఎంటర్టైన్ చెయ్యడం కారణం ఈ పాటే. ఈ పక్కా ఊర మాస్ నాటు సాంగ్ రేంజుని మరింత పెంచుతూ వరల్డ్ బిగ్గెస్ట్ మ్యూజిక్ టీం అయిన బిటిఎస్‌ని కూడా మెప్పించింది. బిటిఎస్ సభ్యుడు, సింగర్, లిరిసిస్ట్ అయిన వరల్డ్ ఫేమస్ ‘జంగ్‌కూక్’ నాటు నాటు సాంగ్‌ని విని ఎంజాయ్ చేస్తున్నారు అంటే ఈ పాటకు ఏ స్థాయిలో గుర్తింపు వచ్చిందో ఊహించవచ్చు.

కోహ్లి శతకంతో భారత్‌కు ఆధిక్యం

తొలి ఇన్నింగ్స్ 571/10, ఆస్ట్రేలియాపై 91 పరుగుల పైచేయి



అహ్మదాబాద్ : విరాట్ కోహ్లి (186, 364 బంతుల్లో 15 ఫోర్లు) శతకోత్సవం. మొతెరా పిచ్‌పై పరుగుల వరద పారించిన స్టార్ బ్యాటర్.. కెరీర్ 28వ టెస్టు శతకం పూర్తి చేశాడు. విరాట్ కోహ్లి సెంచరీకి తోడు అక్షర్ పటేల్ (79, 113 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులు) ధనాధన్ జత కావటంతో నాల్గో రోజు ఆటలో భారత్ వేగంగా పరుగులు సాధించింది. తెలుగు తేజం శ్రీకర్ భరత్ (44, 88 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), రవీంద్ర జడేజా (28, 84 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అనారోగ్యంతో బ్యాటింగ్‌కు రాలేదు. దీంతో భారత్ పది మంది బ్యాటర్లతో బరిలోకి దిగింది. నాల్గో రోజు చివర్లో బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 3/0తో ఆడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా 91 పరుగుల ఆధిక్యం దక్కించుకోగా.. ప్రస్తుతం ఆస్ట్రేలియా మరో 88 పరుగుల వెనుకంజలో నిలిచింది.

విరాట్ కోహ్లి శతక్కొట్టాడు. మూడేండ్ల సుదీర్ఘ శతక నిరీక్షణకు తెరదించాడు. 2019 నవంబర్‌లో బంగ్లాదేశ్‌పై చివరగా టెస్టు శతకం సాధించిన విరాట్ కోహ్లి.. 41 ఇన్నింగ్స్‌ల అనంతరం ఐదు రోజుల ఆటలో మరో సెంచరీ బాదాడు. ఆస్ట్రేలియాపై అహ్మదాబాద్‌లో 186 పరుగుల మెగా ఇన్నింగ్స్‌తో చెలరేగిన విరాట్ కోహ్లి తొలి ఇన్నింగ్స్‌లో 571 పరుగుల భారీ స్కోరు అందించాడు. విరాట్ కోహ్లి శతక జోరుకు అక్షర్ పటేల్ (79) తోడవటంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ విలువైన 91 పరుగుల ఆధిక్యం సొంతం చేసుకుంది. బౌలర్లకు సహకరించని పిచ్‌పై నాలుగు రోజుల్లో రెండు ఇన్నింగ్స్‌లే ముగియటంతో..చివరి టెస్టులో ఫలితం తేలే అవకాశం కనిపించటం లేదు!. భారత్, ఆస్ట్రేలియా చివరి టెస్టులో నేడు ఆఖరు రోజు ఆట.

తొలి సెషన్ : కొంచెం ఇష్టం..కొంచెం కష్టం!

ఓవర్‌నైట్ స్కోరు 289/3తో నాల్గో రోజు ఉదయం సెషన్లో బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియాకు తొలి సెషన్ సంతృప్తి ఇవ్వలేదు. అదే సమయంలో ఆస్ట్రేలియాకు సైతం ఉదయం సెషన్లో పెద్దగా దక్కిందేమీ లేదు. ఈ సెషన్లో టీమ్ ఇండియా 73 పరుగులు రాబట్టగా.. ఆస్ట్రేలియా ఓ వికెట్ దక్కించుకుంది. డ్రింక్స్ విరామం లోపే రవీంద్ర జడేజా వికెట్ కోల్పోయిన టీమ్ ఇండియా.. పరుగుల వేటలో దూకుడు తగ్గించింది. విరాట్ కోహ్లికి జతకలిసిన తెలుగు తేజం కె.ఎస్ భరత్ సావధానంగా బ్యాటింగ్ చేశాడు. ఆసీస్ స్పిన్నర్లు, పేసర్లు గొప్పగా బౌలింగ్ చేయలేదు. అయినా, పరుగులు ఆశించిన విధంగా రాలేదు. కంగారూ కెప్టెన్ స్టీవ్ స్మిత్ గొప్ప ఫీల్డింగ్ మొహరింపులతో బౌండరీల కోసం కోహ్లి, భరత్ చెమటోడ్చాల్సి వచ్చింది. చాలా మంచి షాట్ కొడితే గానీ బౌండరీ దక్కలేదు. లంచ్ విరామ సమయానికి భారత్ 362/4తో నిలిచింది.

రెండో సెషన్ : శతక దాహం తీరింది

కెరీర్‌లో తొలిసారి ఆట పరంగా విమర్శలు ఎదుర్కొన్న విరాట్ కోహ్లి.. టీ20, వన్డేల్లో శతకాలు బాదినా టెస్టుల్లో మాత్రం మూడంకెల స్కోరు అందుకోలేదు. మంచిగా ఆడుతున్నాడు, సెంచరీ కొడతాడనుకున్న ప్రతిసారీ కోహ్లి నిరాశపరిచాడు. అహ్మదాబాద్‌లో మాత్రం కోహ్లి ఆరంభంలో ఇబ్బంది పడ్డాడు. లయాన్ అతడిని ఇరకాటంలో పడేశాడు. కానీ ఆడుతున్న కొద్దీ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించిన విరాట్.. మొతెరాలో శతక మోత మోగించాడు. ఐదు ఫోర్లతో 241 బంతుల్లో 100 పరుగులు బాదాడు. విరాట్ కోహ్లికి ఇది టెస్టుల్లో 28వ సెంచరీ కావటం విశేషం. సుదీర్ఘ కాలం నిరీక్షించిన శతకం సాధించిన వేళ.. డ్రెస్సింగ్‌రూమ్ వైపు వచ్చి హెల్మెట్ తీసి మెడలో రింగ్‌ను ముద్దాడిన విరాట్ కోహ్లి సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ శతకంతో విరాట్ కోహ్లి మోస్తోన్న భారం దిగిపోయిందంటూ కామెంటరీ బాక్స్‌లో వ్యాఖ్యాతలు అనటం గమనార్హం. కోహ్లితో పాటు నిలకడగా ఆడిన కె.ఎస్ భరత్ అర్ధ సెంచరీకి ఆరు పరుగుల ముంగిట వికెట్ చేజార్చుకున్నాడు. డ్రింక్స్ విరామ సమయానికి భారత్ 419/5తో నిలిచింది. ఇక్కడ విరాట్‌కు తోడైన అక్షర్ పటేల్.. ఇన్నింగ్స్‌ను కొత్త పుంతలు తొక్కించాడు. అక్షర్ పటేల్ దూకుడుగా ఆడటంతో పరుగుల వరద పారించింది. ఈ సెషన్లో ఒక వికెట్ కోల్పోయిన భారత్ 110 పరుగులు జోడించింది.

మూడో సెషన్ : విలువైన ఆధిక్యం సొంతం

బంతితో ఆశించిన ప్రదర్శన చేయకపోయినా.. బ్యాట్‌తో సిరీస్‌లోనే అత్యంత నిలకడగా రాణించిన బ్యాటర్‌గా నిలిచాడు అక్షర్ పటేల్. బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌లపై అర్ధ సెంచరీ కొట్టిన అక్షర్.. సొంతగడ్డ అహ్మదాబాద్‌లోనూ అదే జోరు చూపించాడు. నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 95 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన అక్షర్ పటేల్ భారత్‌ను డ్రింక్స్ విరామానికి ముందే ఆధిక్యంలోకి తీసుకొచ్చాడు. మరోవైపు విరాట్ కోహ్లి 12 ఫోర్ల సాయంతో 313 బంతుల్లో 150 పరుగుల మైలురాయి దాటాడు. ధనాధన్ వేటలో ఉన్న అక్షర్ పటేల్ శతకం దిశగా సాగాడు. కానీ అక్షర్ పటేల్ నిష్క్రమణతో భారత్ స్వల్ప ఆధిక్యంతోనే సరిపెట్టుకుంది. విరాట్ కోహ్లి ద్వి శతకం కోసం అభిమానులు ఎదురు చూసినా.. అతడే చివరి వికెట్‌గా నిష్క్రమించాడు. దీంతో 186 పరుగుల వద్ద కోహ్లి మ్యాజిక్ ముగిసింది. లోయర్ ఆర్డర్‌లో అశ్విన్ (7), ఉమేశ్ (0) నిరాశపరిచారు. మహ్మద్ షమి (0) అజేయంగా నిలిచాడు. అనారోగ్యంతో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు రాలేదు. 178.5 ఓవర్లలో 571 పరుగులకు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 91 పరుగుల ఆధిక్యం భారత్ దక్కించుకుంది. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ లయాన్ (3/151), టాడ్ మర్ఫీ (3/113) మూడేసి వికెట్లు పడగొట్టారు.

నాల్గో రోజు ఆటలో 6 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా ముగించింది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (3 బ్యాటింగ్, 18 బంతుల్లో)తో కలిసి నైట్‌వాచ్‌మన్ మాథ్యూ కునేమాన్ (0 బ్యాటింగ్, 18 బంతుల్లో) అజేయంగా నిలిచారు. అశ్విన్ మూడు ఓవర్లలో వికెట్ కోసం ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. జడేజా, మహ్మద్ షమిలు సైతం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 3/0తో కొనసాగుతోంది. ఆసీస్ మరో 88 పరుగుల వెనుకంజలో నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68